ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
శనివారం 24 ఆగస్టు 2024



పల్లెలకు.. పూర్వ వైభవం



- పంచాయతీల్లో కోలాహలంగా గ్రామసభలు
- గ్రామాల్లో సమస్యల పరిష్కారం దిశగా సభలు
- మౌలిక వసతుల కల్పనపై అభిప్రాయాల సేకరణ
- గాడి తప్పిన పాలనను చక్కదిద్దుతామన్న మంత్రులు, ఎమ్మెల్యేలు
- పల్లె ప్రజల ఇక్కట్లను తీర్చడమే గ్రామసభల లక్ష్యమన్న అధికారులు

గుంటూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. ఈ క్రమంలో తొలిగా పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయగా.. శుక్రవారం గ్రామసభలను అట్టహాసంగా నిర్వహించింది. స్వర్ణ గ్రామ పంచాయతీ, పల్లె - పల్లెకు ప్రగతి శోభ పేరుతో ఉపాధి హామీ పథకాన్ని అమలు చేసేందుకు నిర్వహించిన గ్రామసభలు విజయవంతమయ్యాయి. పంచాయతీలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసి పల్లె ప్రగతిని పాతరేయగా కూటమి ప్రభుత్వం వాటి అభివృద్ధి కోసం నడుంకట్టింది. పంచాయతీలను తిరిగి గాడిన పెట్టడంతో పాటు గ్రామాల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించి స్వర్ణ గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం గ్రామసభలను నిర్వహించింది. ప్రజా భాగస్వామ్యంతో వారి అభీష్టం మేరకు సమస్యలు, అవసరాలపై చర్చించడానికి ఈ గ్రామసభలు వేదికలుగా మారాయి. ఐదేళ్లలో గ్రామాల్లో జరిగిన విధ్వంసాన్ని రూపుమాపి తిరిగి పూర్వ వైభవాన్ని నెలకొల్పడానికి, సమస్యల పరిష్కారం దిశగా గ్రామసభల సాక్షిగా తొలి అడుగుపడింది. వికసిత్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా స్వర్ణ పంచాయతీల రూపకల్పనకు శ్రీకారం చుట్టింది. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా జరిగిన గ్రామసభలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. ఆయా సభల్లో ప్రజలతో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో పాటు వివిధ స్థాయిల్లోని ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు కూడా పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దీంతో ఆయా సభలకు పల్లె వాసుల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామల్లో చేపట్టాల్సిన పనులను తెలియజేసేందుకు ప్రజలు పోటీ పడ్డారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామ సభల్లో ప్రజల నుంచి ప్రతిపాదనలు స్వీకరించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రగతి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించారు. గతంలో అధిక పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించేవారు కాదు. చేపట్టినా మొక్కుబడిగానే సాగేవి. అందులో ప్రజల పాత్ర శూన్యంగా ఉండేది. రాజకీయ నాయకులు వారి ఇష్టానుసారంగా వ్యవహరించే వారు. పల్లె ప్రజల ఆకాంక్షలను తెలుసుకునేవారు కాదు. ఈ సారి జిల్లా వ్యాప్తంగా జరిగిన గ్రామసభల తీరే వేరు. ప్రజలతో ప్రజాప్రతినిధులు, అధికారులు మమేకమయ్యే విధానాన్ని కూటమి ప్రభుత్వం గ్రామసభల ద్వారా అమలు చేసి చూసింది. గ్రామాల్లో సమస్యలతో పాటు అవసరమైన మౌలిక వసతుల గురించి స్వయంగా ప్రజలు ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలియజేశారు. వ్యక్తిగత సౌకర్యాలు, పంచాయతీల అవసరాలు, అంతర్గత రహదారులు, మురుగు కాల్వల నిర్మాణం, నీటి సంరక్షణ చర్యలు ఉద్యాన, పట్టు పరిశ్రమ, పశువుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన అనే అంశాలపై ప్రజలతో చర్చించారు. వీటి అమలుకు ప్రజల అభిప్రాయాలను స్వీకరించారు. పల్లెకు, పొలాలకు అవసరమైన పనులకు గ్రామసభల్లో గ్రామీణులు చర్చించి ఆమోదం తెలిపారు. వ్యవసాయ పనులను ఉపాధి హామీ పనులకు అనుసందానం చేసే ప్రక్రియలో భాగంగా తొలి అడుగు గ్రామసభల వేదికగా పడడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామసభలను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, జిల్లా నీటియాజమాన్య సంస్థ తదితర శాఖలు సంయుక్తంగా నిర్వహించాయి. ప్రధానంగా నాలుగు అంశాలతో గ్రామాభివృద్ధికి సరికొత్త కార్యచరణని రూపొందించారు. ప్రతీ ఇంటికి విద్యుత్, కుళాయి కనెక్షన్లు, వంటగ్యాస్, వ్యక్తిగత మరుగుదొడ్డి సదుపాయం ఉండేలా ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశమని ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామసభల్లో స్పష్టం చేశారు.



రేపల్లె: ధూళిపూడిలో గ్రామసభలో మాట్లాడుతున్న రెవెన్యూ, స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్



బాపట్ల: మక్కెనవారిపాలెం గ్రామసభలో వచ్చిన వినతులను పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి



దుగ్గిరాల: రేవేంద్రపాడు గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ

ప్రతి ఒక్కరికీ 100 రోజుల ఉపాధి

మంత్రి నాదెండ్ల

గుంటూరు జిల్లా వ్యాప్తంగా 233 పంచాయతీల్లో గ్రామసభలు జరిగాయి. తెనాలి నియోజకవర్గం కొల్లిపర మండలం వల్లభాపురంలో జరిగిన గ్రామసభలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రకార్ జైన్‌తో కలిసి పాల్గొని కార్యక్రమం ముఖ్యఉద్దేశాన్ని వివరించారు. అనంతరం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. గత ప్రభుత్వం ఉపాధి హామీ నిధులను పక్కదారి పట్టించడంతో గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని మంత్రి తెలిపారు. ప్రధానంగా ప్రతీ ఒక్క వ్యవసాయ కార్మికుడికి 100 రోజుల పనిదినాలు కల్పించేలా చూస్తామన్నారు. అంతకంటే ఎక్కువ కోరుకున్నా ఇస్తామన్నారు. ఎంత లేబర్ కాంపొనెంట్‌ని ఎక్కువగా వినియోగించుకుంటే అంత మెటీరియల్ కాంపొనెంట్ కింద నిధులు వస్తాయని చెప్పారు. ప్రతీ ఒక్క కూలీకి కనీసం రోజుకు రూ.300 వేతనం వచ్చేలా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 300 ఎకరాల్లో హార్టికల్చర్‌ను సాగుచేసేలా లక్ష్యంగా పెట్టుకున్నామని అందుకు ప్రభుత్వం సహాయం చేయనున్నట్లు తెలిపారు. మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల మండలం రేవేంద్రపాడులో జరిగిన గ్రామసభలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ పాల్గొన్నారు. 2014-19 మధ్య చంద్రబాబు ముఖ్యమంత్రిగా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు మినహా గత వైసీపీ ప్రభుత్వంలో ఏఒక్క అభివృద్ధి పనులూ జరగలేదని ఆమె తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గం తిక్కిరెడ్డిపాలెంలో జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పాల్గొని ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. చేబ్రోలు గ్రామ సభలో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొని ప్రసంగించారు. పంచాయతీల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మేడికొండూరులో ఏర్పాటు చేసిన గ్రామ సభలో తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పాల్గొని సభ నిర్వహణలో అధికారుల అలసత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసీపీ పాలకులు ఐదేళ్లు బటన్ నొక్కుతూ పనిచేస్తే అధికారులు కూడా తమకు తోచిన బటన్లు నొక్కుతూ కాలయాపన చేశారని, ఇలాంటి వాటికి స్వస్తి పలికి ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు తమతో కలిసి ముందుకు రావాలన్నారు.



కొల్లిపర: వల్లభాపురం గ్రామ సభలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్



చేబ్రోలు గ్రామ సభలో గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్



ప్రత్తిపాడు: తిక్కిరెడ్డిపాలెం గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



మేడికొండూరు గ్రామ సభలో మాట్లాడుతున్న తెనాలి శ్రావణ్ కుమార్



నాదెండ్ల : నాదెండ్ల గ్రామసభలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుల్లారావు



వేమూరు గ్రామ సభలో ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు



సత్తెనపల్లి: నందిగామలో జరిగిన గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

అమరావతి రైలుకు.. తొలి అడుగు



- రాజధాని రైలుమార్గానికి రూ.50.01 కోట్లు
- ఈ ఏడాది బడ్జెట్‌లో తొలిగా నిధులు కేటాయింపు
- గుంతకల్లు డబ్లింగ్‌కు రూ.480 కోట్లు, బీబీనగర్‌కు రూ.220 కోట్లు
- మోటుమర్రి - విష్ణుపురం డబ్లింగ్‌కు కూడా నిధులు
- గుంటూరు డివిజన్ పరిధిలోని ప్రాజెక్టులకు రూ.1100 కోట్లకుపైగా నిధులు
- రైల్వే పింక్‌బుక్‌లో వెలుగుచూసిన కేంద్ర బడ్జెట్ కేటాయింపులు

గుంటూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అమరావతి రైలు మార్గానికి తొలి అడుగుపడింది. గత ఐదేళ్లుగా వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన రాజధాని రైలు మార్గానికి కూటమి ప్రభుత్వంలో తొలి ఏడాదిలోనే నిధులు కేటాయింపు జరిగింది. తొలిసారిగా రూ.50.01 కోట్ల నిధులను కేటాయించడంతో సాధ్యమైనంత త్వరలోనే పనులు ప్రారంభమౌతాయని పలువురు భావిస్తున్నారు. అమరావతి రైలుతో పాటు గుంటూరు రైల్వే డివిజన్‌కి సంబంధించి కొత్త ప్రాజెక్టులు, ఇప్పటికే నిర్మాణంలో ఉన్న వాటిని మరింత ముందుకు తీసుకెళ్లేలా కేంద్రం నిధుల కేటాయింపు జరిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని ప్రాజెక్టులకు రూ.1100 కోట్లకు పైగా నిధులు కేటాయించడంపై రైల్వే వర్గాలతో పాటు ఉమ్మడి గుంటూరు జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన నెల తర్వాత రైల్వే కేటాయింపులకు సంబంధించిన పింక్‌బుక్ ఎట్టకేలకు రైల్వేపోర్టల్‌లో అందుబాటులోకి రావడంతో ఈ అంశాలు వెలుగుచూశాయి. అటు కేంద్రం, ఇటు రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వాలు(డబుల్ ఇంజిన్ సర్కార్) కావడంతో ఏపీకి బడ్జెట్ కేటాయింపుల్లో మరింత ప్రాధాన్యం ఇచ్చినట్లు తేలింది. సీఎం చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీల ప్రయత్నాలు ఫలించినట్లు అర్థమవుతోంది. ఇంచుమించు ఏడు, ఎనిమిదేళ్ల క్రితం అమరావతి రాజధాని నూతన రైలుమార్గానికి పింక్‌బుక్‌లో చోటు దక్కింది. ఆ తర్వాత తొలిగా ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించి కేంద్రం ఉదారతను చాటుకున్నది. మరికొన్ని ప్రాజెక్టులకు కూడా భారీగానే నిధులు కేటాయించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమౌతున్నది.

106 కిమీ పొడవున..

అమరావతి రాజధానికి రైలుమార్గం ఉంటే అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందని 2014-19 మధ్యనే టీడీపీ ప్రభుత్వం ఆలోచన చేసింది. అప్పట్లో కేంద్రంలో ఉన్న ఎన్‌డీఏ-1 ప్రభుత్వంతో మాట్లాడి ప్రాజెక్టుని మంజూరు చేయించింది. ఈ రైలుమార్గం మొత్తం పొడవు 106 కిలోమీటర్లు. ఇందులో ఒక సెక్షన్ ఎర్రుపాలెం - నంబూరు మధ్య 55.8 కిలోమీటర్ల పొడవు, రెండోది అమరావతి - పెదకూరపాడు 24.5 కిలోమీటర్లు, మూడోది సత్తెనపల్లి - నరసరావుపేట 25 కిలోమీటర్ల పొడవునా డీపీఆర్ కూడా ఆమోదించారు. మొత్తం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.2679.59 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ రైలుమార్గానికి అవసరమయ్యే భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించి ఇవ్వాలి. అయితే ఎన్‌డీఏ-1 చివరలో బీజేపీ, టీడీపీకి మధ్య అభిప్రాయభేదాలతో ప్రాజెక్టు ముందుకు కదలలేదు. ఆ తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం అసలు ఈ ప్రాజెక్టు ప్రస్తావన అనేది ఐదేళ్లలో తీసుకురాలేదు. దాంతో ఏటా కేంద్ర బడ్జెట్‌లో మొక్కుబడిగా రూ.లక్ష మాత్రమే కేటాయిస్తూ వచ్చింది. ఇప్పుడు మళ్లీ ఎన్‌డీఏ ప్రభుత్వం కేంద్రంలో ఏర్పడటం, అందులో టీడీపీ భాగస్వామ్యం కావడంతో అమరావతి రైలుమార్గానికి మళ్లీ మంచి రోజులొచ్చాయి.

డబ్లింగ్‌లకు నిధులే నిధులు..

ఇక నిర్మాణంలో ఉన్న నడికుడి - శ్రీకాళహస్తి నూతన రైలుమార్గం పనులను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్రం ప్రాధాన్యం ఇచ్చింది. ఎస్ ఫండ్ కింద రూ.250 కోట్లు, కేపిటల్ ఫండ్ కింద రూ.60 కోట్లు కలిపి మొత్తం రూ.310 కోట్లు కేటాయించింది. గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్‌లో కీలకమైన నల్లమడ అటవీ ప్రాంతంలో పనులు చేపట్టాల్సి ఉన్నది. ఇందుకు ఖర్చు కూడా ఎక్కువ కానుండటంతో ఏకంగా ఈ బడ్జెట్‌లో రూ.480 కోట్లు కేటాయింపులు జరిపింది. రద్దీ మార్గాల్లో ఒకటిగా మారిన గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్ కోసం ఇప్పటికే భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టుకి రూ.220 కోట్లు కేటాయించింది. విష్ణుపురం బైపాస్ రైలుమార్గానికి రూ.20 కోట్లు, మోటుమర్రి - విష్ణుపురం డబ్లింగ్ ప్రాజెక్టుకి రూ.50 కోట్లు కేటాయించింది. 88 కిలోమీటర్ల పొడవునా నిర్మించనున్న ఈ రైలుమార్గంలో మోటుమర్రి వద్ద రైల్ ఓవర్ రైలు బ్రిడ్జిని కూడా నిర్మిస్తారు. అలానే గుంటూరు యార్డులో మళ్లీ ట్రాకింగ్ కనెక్టివిటీ పనుల నిమిత్తం మరో రూ.50 కోట్లు కేటాయించింది.

30వ రోజూ లోకేశ్ ప్రజాదర్బార్

- ప్రజల విన్నపాలను స్వీకరించిన మంత్రి
- సమస్యలు పరిష్కరిస్తానన్న హామీతో అర్జీదారుల సంతృప్తి

తాడేపల్లి, ఆగస్టు 23: గత ప్రభుత్వ హయాంలో తీవ్రంగా ఇబ్బందులు పడి అష్టకష్టాలపాలైన పలువురికి 30 రోజులుగా మంత్రి లోకేశ్ ప్రజాదర్బార్ అభయం ఇస్తోంది. అర్జీదారుల నుంచి నేరుగా వినతులను స్వీకరించి సమస్యల పరిష్కారానికి హామీ ఇస్తుండటంతో రాష్ట్ర నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో బాధితులు ప్రజాదర్బార్‌కు పోటెత్తుతున్నారు. శుక్రవారం తాడేపల్లిలో జరిగిన ప్రజాదర్బార్‌కు కూడా వివిధ ప్రాంతాల నుంచి అర్జీదారులు పెద్దసంఖ్యలో వచ్చారు. బాధితులు నేరుగా లోకేశ్‌ను కలిసి ఆయనకు సమస్యలను వివరిస్తున్నారు. లోకేశ్ హామీతో తమ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని అర్జీదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అన్న క్యాంటిన్‌లో ఉపాధి కల్పించాలని అనారోగ్యంతో బాధపడుతున్న తన భర్తకు పెన్షన్ మంజూరు చేసి కుటుంబ పోషణకు ఉపాధి కల్పించాలని యర్రబాలేనికి చెందిన షేక్ ఖాసింబీ లోకేశ్‌ను కోరారు. అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్న తమకు శాశ్వత ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని చినకాకానికి చెందిన అరుణకుమారి కోరారు. ఎలాంటి ఆధారం లేని తమ కుటుంబానికి ఇల్లు మంజూరుతో పాటు ఉద్యోగ అవకాశం కల్పించాలని ఉండవల్లికి చెందిన దివ్యాంగుడైన రామారావు కోరారు. గత వైసీపీ ప్రభుత్వ అండతో నకిలీ పత్రాలు సృష్టించి తన 32 సెంట్ల స్థలాన్ని బంధువులు కబ్జా చేశారని విచారించి తగిన న్యాయం చేయాలని బొల్లాపల్లి మండలం కనుముల చెరువుకు చెందిన గుమ్మా వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. తెలుగు సంస్కృత అకాడమిలో టైమ్ స్కేల్ ఉద్యోగులుగా పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు హెచ్ఆర్‌పీ, సీసీఏను కొనసాగించాలని సిబ్బంది కోరారు. ఏపీ సాంకేతిక విద్యాశాఖలో కాంట్రాక్టు ఉద్యోలుగా పని చేస్తున్న తమను క్రమబద్ధీకరిస్తూ చర్యలు తీసుకోవాలని సిబ్బంది విజ్ఞప్తి చేశారు.





దివ్యాంగుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్







ప్రత్యేక అలంకరణలో కన్యకా పరమేశ్వరీ అమ్మవారు, ఇన్‌సెట్‌లో అమ్మవారు. ఆలయంలో పూజలలో పాల్గొన్న మహిళలు - గుంటూరు

17,500 కి.మీ రోడ్లు వేసేందుకు ప్రణాళిక

- రూ.500 కోట్లతో నీటి సమస్య పరిష్కారం
- గ్రామాల అభివృద్ధికి రూ.990 కోట్లు
- రెవెన్యూశాఖా మంత్రి అనగాని



వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, ఆగస్టు 23: కూటమి ప్రభుత్వం ద్వారా రాష్ట్రంలోని పంచాయతీల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. నగరం మండలం ధూళిపూడిలో ఏర్పాటు చేసిన గ్రామసభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మంత్రి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా పంచాయతీల అభివృద్ధి కోసం మంజూరు చేసిన నిధులను దారి మళ్లించి జగన్ ప్రభుత్వం కోట్లు దోచుకుందన్నారు. పంచాయతీలకు మంజూరైన రూ.13 వేల కోట్లను జగన్ ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. పంచాయతీల అభివృద్ధికి రూ.990 కోట్లతో 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు మంజూరు అయ్యాయని, రూ.500 కోట్లతో జలజీవన్ మిషన్ ద్వారా మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 70 రోజుల్లోనే ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తీసుకు వెళ్తున్నారని అన్నారు. రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి 17,500 కి.మీటర్లు రోడ్లు వేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీల అభ్యున్నతి కోసం పవన్‌కల్యాణ్ ప్రత్యేక దృష్టిసారించారని చెప్పారు. పార్లమెంట్ సభ్యులు తన్నేటి కృష్ణ మాట్లాడుతూ ధూళిపూడి గ్రామంలో ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను, సామాజిక ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ చేసి 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి మాట్లాడుతూ 30 పడకల వైద్యశాలను ఏర్పాటు చేయడం మంత్రి అనగాని ముందు చూపన్నారు. రేపల్లె ఆర్డీవో హేలా షారోన్, డీసీహెచ్ డాక్టర్ శేషుకుమార్, డీఎంఅండ్‌హెచ్‌వో విజయమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు నాగమణి, మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య, మాజీ జడ్పీటీసీ మేకా వెంకట శివరామకృష్ణ,సంగం డైరీ డైరెక్టర్ ఎస్వీకే ప్రసాద్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మత్తి భాస్కరరావు పాల్గొన్నారు.

నిజాయితీగా పని చేయండి

- నిధులు దుర్వినియోగం చేస్తే సహించేదిలేదు..
- పనిచేయని వారిపై క్రిమినల్ కేసులు
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
- గ్రామసభలో అధికారులకు హెచ్చరిక



వల్లభాపురం గ్రామ సభలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, ఆగస్టు 23 : అధికారులు నిజాయితీగా పనిచేయాలని, నిధులు దుర్వినియోగం చేస్తే సహించేదిలేదని, నిజాయితీగా పని చేయని అధికారులపై అవసరమైతే క్రిమినల్ కేసులు పెట్టనున్నట్లు పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామసభల్లో భాగంగా మండల పరిధిలోని వల్లభాపురం పేరంటాళ్లమ్మ సెంటర్‌లో ఎంపీడీవో విజయలక్ష్మి అధ్యక్షతన గ్రామ సభ నిర్వ హించారు. కలెక్టర్ నాగలక్ష్మి, సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్‌తో కలిసి మంత్రి మనోహర్ గ్రామసభలో పాల్గొన్నారు. ఈ తొలుత శాఖల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల ద్వారా గ్రామంలో ఏ విధంగా రైతులకు సహాయ పడ్డారో వివరించాలని మనోహర్ అధికారులను కోరటంతో వారి నుంచి సరైన సమాధానం రాకపోవటంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్‌ఆర్‌జీఎస్ సిబ్బంది పని తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. అనంతరం ప్రజలను ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని అడగటంతో పెన్షన్‌లు, ఇళ్ల స్థలాలు, మంచినీటి సమస్య, ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం, మందులు, ఎరు వులు, పొలాలు వెళ్ళటానికి రహదారులు, డ్రైనేజీలు వంటి పలు సమస్యలపై మనోహర్‌కు వినతి పత్రాలు ద్వారా తెలియజేశారు.

ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ బాపూజీ గ్రామ స్వరాజ్యం కోసం కన్నకలలను నేరవేర్చేటందుకు ఎక్కడ అవినీతి లేకుండా పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం కోసం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తీసుకున్న నిర్ణయం మేరకు రాష్ట్రవ్యాప్తంగా 13,362 గ్రామ సభలు నిర్వహించడం హర్షణీయమన్నారు. మూడు నెలల్లో నిధులు తీసుకువచ్చి గ్రామాలాభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో నిధులు దుర్వినియోగం జరిగాయని తాను ప్రక్షాళన చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం నిజాయితీగా పని చేస్తుందని అధికారులు కూడా నిజాయితీగా పని చేయాలని లేనిపక్షంలో వెళ్ళిపోవచ్చని తెలియజేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడేలా ప్రభుత్వం ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రణాళికా బద్ధంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. జిల్లాలో 300 ఎకరాల్లో హార్టికల్చర్‌ను సాగుచేసేలా లక్ష్యంగా పెట్టుకున్నామని అందుకు ప్రభుత్వం సహాయం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, ఉపసర్పంచ్ అవుతు పోతిరెడ్డి, డ్వామా పీడీ ఉమాదేవి, ఉద్యానవన శాఖాధికారి రవీంద్ర, నాయకులు వంగా సాంబిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు ఉపాధి కల్పనే లక్ష్యం



మాట్లాడుతున్న చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి సునీత

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 23 : చేనేత పరిశ్రమను ప్రోత్సహించి కార్మికులకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సునీత పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఐలవరం ఖాదీ సొసైటీలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ చేనేత పరిశ్రమ అభివృద్ధి కోసం ప్రకాశం పంతులు ఎంతో శ్రమించారన్నారు. ఆయన జయంతి వేడుకలను నిర్వహించి ఆయన జీవిత చరిత్ర తెలియజేయాలనే ఉద్దేశంతో ఖాదీ సొసైటీలు నిర్వహించినట్లు చెప్పారు. చేనేత కార్మికులు వస్త్రాల తయారీకి ఆసక్తి కనబరచాలన్నారు. చేనేత వస్త్రాల తరహాలోనే ఖాదీ వస్త్రాల తయారీ ఉంటుందని, కార్మికులకు ఎంత వేతనం కావాలో చెబితే ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామన్నారు. సొసైటీలో ఉన్న ఖాదీ వస్త్రాలను ఆమె పరిశీలన చేశారు. చేనేత జౌళి శాఖ కమిషనర్ జి.రేణుకారాణి, ఖాదీ ఇండస్ట్రీ బోర్డు సీఈవో నాయక్, జాయింట్ డైరెక్టర్ కె.కన్నబాబు, గుంటూరు, బాపట్ల డీహెచ్‌టీవోలు రాజవర్ధన్, డిప్యూటీ కమిషనర్ నాగేశ్వరరావు, సర్పంచి కోటేశ్వరరావు, ఎంపీటీసీ శ్రీనివాసరావు, సొసైటీ మేనేజర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 21,900 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 23: ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు నీటిని విడుదల కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టు నుంచి 38,742 క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ అజముద్దీన్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 30 గేట్లను 1 అడుగు ఎత్తి దిగువకు 21,900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 16,842 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ తెలిపారు.

బెయిల్‌కి పూచీకత్తుగా నకిలీ పత్రాలు

కొల్లూరు, ఆగస్టు 23: బెయిల్‌కి పూచీకత్తుగా కోర్టుకు సమర్పించిన పత్రాలపై కోర్టు ఆదేశాల మేరకు తెనాలి పోలీసులు విచారణ జరిపారు. కొల్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న బి.మల్లిఖార్జున సంతకం, స్టాంపులతో కొండేటి నాగజ్యోతి, కొండేటి గోపికృష్ణ, మండవ రమాదేవి పేర్లపై వారి ఆస్తికి సంబంధించిన విలువ ధ్రువపత్రాలను బెయిల్ నిమిత్తం ఈ నెల 13వ తేదీన మంజూరు చేసినట్లుగా కోర్టుకు సమర్పించారు. ఆ పత్రాలు ఒరిజినలా లేక నకిలీవా నిర్ధారించాలని కోర్టు వారు తెనాలి పోలీసులను ఆదేశించగా, వారు సంబంధిత కార్యదర్శికి పంపించారు. వాటిని పరిశీలించిన కార్యదర్శి ఆ పత్రాలు తాను మంజూరు చేయలేదని తన సంతకం ఫోర్జరీ చేయడంతో పాటు కార్యాలయ స్టాంపును కూడా తయారు చేసి వేసినట్లుగా గుర్తించారు. దీంతో సదరు వ్యక్తులపై కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కోర్టుకు సమర్పించిన అసలు పత్రాలు ఉంటేనే ఫిర్యాదు స్వీకరిస్తామని ఏఎస్ఐ చెప్పినట్లు కార్యదర్శి తెలిపారు.

సీఎంఏలో శ్రీమేధ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అన్నా నందకిషోర్

గుంటూరు(విద్య),ఆగస్టు 23: జాతీయ స్థాయిలో ది ఇనిస్టిట్యూట్ ఆఫ్‌కాస్ట్ అకౌంటెన్సీ ఆఫ్ ఇండియా విడుదల చేసిన సీఎంఏ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఛైర్మన్ అన్నా నందకిషోర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ విద్యార్థి షేక్ ఇర్ఫాన్ 557 మార్కులతో 19వ ర్యాంకు, అన్నా ధీరజ్ 543 మార్కులతో 27వ ర్యాంకు సాధించారని తెలిపారు. అదేవిధంగాడి.లక్ష్మీనరసింహ 460 మార్కులు, ఎన్.స్మృతిహర్షిత 448, టి.రూపశ్రీ 439, టి.వరలక్ష్మీ 436 మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులను డైరెక్టర్ శ్రీలక్ష్మీ, అధ్యాపకులు అభినందించారు.

జిల్లా సబ్‌జూనియర్ ఖోఖో జట్ల ఎంపిక

నకరికల్లు, ఆగస్టు 23: సెప్టెంబరు 1న నరసరావుపేట శంకర భారతీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి గుంటూరు జిల్లా సబ్‌జూనియర్ బాలబాలికల ఖోఖో జట్ల ఎంపిక జరుగనున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి చింతా పుల్లయ్య తెలిపారు. ఎంపికైన జట్లు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ ఎంపికలో పాల్గొనే బాలబాలికలు అక్టోబరు 1, 2010న గాని ఆ తరువాత గాని పుట్టినవారై ఉండాలన్నారు. వయస్సు, ఎత్తు, బరువు కలిపి మొత్తం 217 పాయింట్లు మించి ఉండకూడదన్నారు. ఒక పాఠశాల నుంచి ముగ్గురు లేదా నలుగురు మాత్రమే పాల్గొనాలన్నారు. ఎంపికలకు వయస్సు ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలన్నారు. వివరాలకు నరసరావుపేట శంకర భారతీపురం ఫిజికల్ డైరెక్టర్ జి.ఝాన్సీరాణి 9949533234 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సప్త పర్వతాలు అధిరోహించడమే లక్ష్యం



సర్టిఫికెట్, మెడల్‌తో అన్నపూర్ణ

తాడేపల్లి టౌన్, ఆగస్టు 23: ఐరోపా ఖండంలోని అతి పెద్దదైన ఎల్బ్రస్ పర్వతాన్ని అలవోకగా అధిరోహించిన బండారు అన్న పూర్ణ శుక్రవారం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఆమె సొంతింటికి వచ్చారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా పూజలు చేసుకుని కుటుంబసభ్యుల నడుమ ఆనందోత్సాహాలతో గడిపారు. ఈ సం దర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడు తూ బాల్యం నుంచి కొండలు ఎక్కడానికి, పర్వతారోహణ ఆసక్తి ఉన్నా ఎవరూ స్వాగతించే వారు కాదని అన్నారు. తండ్రి రామచంద్రరావు స్ఫూర్తి , భర్త మహేష్‌రెడ్డి ప్రోద్బలంతో తాను అనుకున్న లక్ష్యాలను సాధించగల్గుతున్నానని తెలిపారు. మెరైన్ కోట్స్ పిప్స్‌లో పెయింటింగ్ మార్కెటింగ్ చేసే భర్త మహేష్‌రెడ్డి ఉద్యోగరీత్యా సౌదీలోని జెడ్డాలో నివాసం ఉంటున్నామని చెప్పారు. అక్కడే ఇంటర్నేషనల్ ఇండియన్ స్కూల్‌లో బయాలజీ టీచర్‌గా పని చేస్తున్నట్టు అన్నపూర్ణ తెలిపారు.

వైసీపీ ఎంపీపీ రాజీనామా



సంతోష రూపవాణి

దుగ్గిరాల, ఆగస్టు 23: దుగ్గిరాల మండల అధ్యక్షురాలు దానబోయిన సంతోషరూపవాణి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించారు. అనివార్యకారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన ఆమె తనకు సహకరించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. గత మండల పరిషత్ ఎన్నికల్లో ఎంపీపీ స్థానం బీసీ(మహిళ)కి రిజర్వ్ చేశారు. కాగా మొత్తం 18 స్థానాల్లో తె.దే.పా 9, జనసేన 1, మొత్తం 10 మంది సభ్యుల మద్దతుతో తె.దే.పా సభ్యులు విజయం సాధించి 2 స్థానాలు ఆధిక్యత కలిగి ఉన్నారు. సభ్యుల సంఖ్య ప్రకారం గెలుపొందిన వారిలో తె.దే.పాకు చెందిన ఏకైక బీసీ(ముస్లిం మైనార్టీ) సభ్యురాలు చిలువూరు ఎంపీటీసీ షేక్ జబీన్‌కు ఎంపీపీ పదవి దక్కాల్సి ఉంది. ఆమె కుటుంబీకులందరికీ బీసీ సర్టిఫికెట్లు ఉన్నప్పటికీ, పలు రాజకీయ కారణాలతో అప్పటి తహసీలార్ మల్లీశ్వరి తమకు బీసీ సర్టిఫికెట్ ఇవ్వడం లేదంటూ, తనకు జరిగిన అన్యాయంపై హైకోర్టును ఆశ్రయించినప్పటికీ ఫలితం లేకపోయింది. కారణాలేవైనప్పటికీ తె.దే.పా అధికారంలోకి వచ్చాక జరిగిన తొలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలోనే ఎంపీపీ రాజీనామానాతో జబీన్‌ను ఎంపీపీగా ఎన్నుకునేందుకు మార్గం సుగమమైంది.

అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఇద్దరు ఎంపిక



షానూన్, సాదియా అల్‌మాస్‌తో అసోసియేషన్ ప్రతినిధులు

మంగళగిరి సిటీ, ఆగస్టు 23: ఈ నెల 28 నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు మాల్టా దేశంలో జరుగనున్న అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు భారత జట్టు తరపున ప్రాతినిధ్యం వహించేందుకు గుంటూరు జిల్లా నుంచి ఇద్దరు మహిళా లిఫ్టర్లు ఎంపికైనట్లు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని తెలిపారు. జూనియర్స్ 43 కిలోల విభాగంలో తెనాలి పట్టణానికి చెందిన ఎం.షానూన్, 57 కిలోల విభాగంలో మంగళగిరికి చెందిన షేక్ సాదియా అల్‌మాస్ ఎంపికైనట్లు వెల్లడించారు. ఎంపికైన లిఫ్టర్లు అంతర్జాతీయ వేదికపై అద్భుతంగా రాణించి దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. షానూన్, సాదియా అల్‌మాస్‌ను రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, ప్రతినిధులు సకల కోటేశ్వరరావుర, మద్ది ప్రభాకర్ తదితరులు అభినందించారు

టీడీపీలో చేరిన నకరికల్లు ఎంపీపీ



కన్నా సమక్షంలో టీడీపీలో చేరిన నకరికల్లు ఎంపీపీ,వైసీపీ నేతలు

నకరికల్లు,ఆగస్టు23: నకరికల్లు మండల పరిషత్ అధ్యక్షురాలు మేచారపు అనూరాధ ఆమె భర్త రామాంజినేయులు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. గుండ్లపల్లికి చెందిన అనూరాధ వైసీపీ ఎంపీటీసీగా గెలిచి ఎంపీపీగా ఎన్నికైనారు. ఎంపీపీతో పాటు గుండ్లపల్లి ఉపసర్పంచి జూపల్లి మోసయ్య, వగడాల బోదయ్య, మేకల డానియేలు, మేచారపు బ్రహ్మయ్య వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఎన్నికలకు ముందే వైసీపీ కి చెందిన జడ్పీటీసీ జూనెబోయిన హరీష్ టీడీపీలో చేరారు.

1.0551 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, ఆగస్టు 23: సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో గురువారం రాత్రి 12 గంటల వరకు 2 యూనిట్ల ద్వారా 1.0551 ఎంయూల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ చెప్పారు. ప్రాజెక్టుకున్న 3 గేట్లను ఎత్తి 21,258, టీఆర్‌సీ ద్వారా 8512 క్యూసెక్కులు పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. సాగర్ నుంచి 29700 క్యూసెక్కులు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 7.05 టీఎంసీల నీరుందన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

టీడీపీ వర్గీయులపై వైసీపీ దాడి

- టీడీపీ కార్యకర్తకు కత్తిపోట్లు



కత్తి పోట్లకు గురైన మధన మోహన్

పొన్నూరుటౌన్, ఆగస్టు23: టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకుడు కత్తితో దాడి చేసిన సంఘటన పొన్నూరు మండలం మునిపల్లె గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు మునిపల్లె గ్రామానికి చెందిన అన్నపురెడ్డి మధన మోహన్, శ్రీకాంత్ టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. 2019 ఎన్నికల సమయంలో వైసీపీ నాయకుడు గోపిశెట్టి శివ నాగేశ్వరరావు టీడీపీ కార్యకర్తలపై దాడి చేయటమే కాకుండా తిరిగి వారిపైనే కేసులు పెట్టించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూడ మధన్ మోహన్ టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరించాడు. దీంతో ఎరువులు తెచ్చుకోవడానికి మధన్ మోహన్ వెళ్తుండగా గోపిశెట్టి శివనాగేశ్వరరావు కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపడిచాడు. అడ్డుకోబోయిన శ్రీకాంత్ కూడా గాయపడ్డాడు. కత్తిపోట్లకు గురైన మదన్‌మోహన్‌పై శివనాగేశ్వరరావు కుటుంబ సభ్యులు కూడా నీసాలతో దాడి చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు పొన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రూరల్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ కార్యకర్తపై హత్యాయత్నం



చికిత్స పొందుతున్న మక్కెన స్వామి

వినుకొండటౌన్, ఆగస్టు 23: మండలంలోని పిట్టంబండ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బ్రహ్మానాయుడు పీఏ శివ ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్త మక్కెన స్వామిపై హత్యాయత్నానికి పాల్పడిన సంఘటనపై గురువారం పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు రంజిత్ సింగ్ కాపు కాచి బీరు బాటిల్స్, కర్రలతో దాడి చేయడంతో స్వామికి తీవ్రగాయాలు అయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం స్వామిని నర్సరావుపేటలోని ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

46,598 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 41,847 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 46,598 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 14,813 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	17000	334	9200	13500
నెంబరు. 5	10000	12500	నెంబరు. 5	9500	12200
273	10000	12500	273	10000	12500
341	8700	16500	341	9000	15000
4884	10600	12500	4884	9000	10000
సూపర్ 10	12700	12700	సూపర్ 10	11500	11500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18700	తేజ	9000	18800
బ్యాడిగి	9000	16000	బ్యాడిగి	8500	13000
దేవనూరుడీలక్స్	8500	14500	దేవనూరుడీలక్స్	8500	16000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	11500

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ఎమర్జెన్సీని తలపించిన జగన్ పాలన : కనపర్తి



గుంటూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్ల జగన్ పాలన ఎమర్జెన్సీని తలపించిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అధికారంలో వున్నపుడు అరాచకాలు, దొంగ కేసులు లేవని వైసీపీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. జగన్ వ్యాఖ్యలు విని సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలే నవ్వుకుంటున్నారని అన్నారు. జగన్ కేవలం అన్నం తినడానికి, అబద్ధాలు మాట్లాడడానికి మాత్రమే నోరు తెరుస్తాడని ఆయన ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష నేత ఇంటిపైకి, కార్యాలయాల మీదకు స్వయంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలే రౌడీలను వెంటేసుకుని దాడులకు తెగించే నీచ సంస్కృతికి తెరలేపింది జగన్‌రెడ్డి కాదా అని ప్రశ్నించారు. టీడీపీ నేతలు బోండా ఉమా, బుద్ధా వెంకన్నలపై మాచర్ల మానవ మృగాలు పిన్నెల్లి సోదరులు చేయించిన దాడిపై జగన్ ఏం సమాధానం చెబుతారని ఆయన నిలదీశారు.

కూటమి పాలనతో చిగురులు తొడుగుతున్న గ్రామీణాభివృద్ధి: డేగల



గుంటూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి పాలనతో గ్రామీణాభివృద్ధి చిగురులు తొడుగుతోందని టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ అన్నారు. పార్టీ నగర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో జీవం కోల్పోయిన పంచాయతీరాజ్ వ్యవస్థకు చంద్రబాబు ఊపిరి ఊది బతికిస్తున్నారన్నారు. జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ఐదేళ్లపాటు చీకట్లో మగ్గిన గ్రామాలు నేడు వెలుగులతో నిండబోతున్నాయన్నారు. గత ఐదేళ్లలో పంచాయతీలకు చెందాల్సిన 13 వేల కోట్ల రూపాయలు తన సొంత ఖాతాకు మళ్లించుకుని గ్రామాలకు జగన్ ద్రోహం చేశాడని డేగల ఆరోపించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన రెండు నెలల్లోనే గ్రామీణాభివృద్ధి కోసం 15వ ఆర్థిక సంఘం నిధులు 990 కోట్ల రూపాయలు, జలజీవన్ మిషన్ కింద రూ.500 కోట్లు పంచాయతీల ఖాతాల్లో జమ అయ్యేలా చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర అభివృద్ధి శరవేగంగా ముందుకు సాగుతుందని, అది గ్రామ సభల నుంచే మొదలైందని డేగల అన్నారు.

ఆర్వీఆర్‌అండ్‌జేసీ ఐటీబీఐ సెంటర్‌ను సందర్శించిన డీఎస్‌టీ బృందం

గుంటూరు(విద్య), ఆగస్టు 23 : స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఇంక్లూసివ్ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యూబేటర్(ఐటీబీఐ) కేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని డిపార్టుమెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(డీఎస్‌టీ) డైరెక్టర్ డాక్టర్ నవీన్‌వశిష్ఠ, సిఎంఆర్ టెక్నికల్ డీన్ అశుతోష్ సక్సేనా, నరేంద్ర నేర్ల, ఆచార్య రాధాకృష్ణ, ఆహబ్ సీఈవో రవిఈశ్వరరావు తదితరుల బృందం శుక్రవారం పరిశీలించారు. అంకుర పరిశ్రమల ఏర్పాటు కోసం డీఎస్‌టీ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని బృందం సభ్యులు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు యువతలో ఉన్న నైపుణ్యాలను వెలికితీసి వారిని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడానికి ఇక్కడి ఐటీబీఐ కేంద్రం కృషి చేస్తుందని వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, ఆర్‌అండ్‌డి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ నార్నె శ్రీనివాసరావు, ఐటీబీఐ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖరరావు, కో ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఎస్.రాధిక పాల్గొన్నారు.



సెంటర్ వివరాలు తెలుసుకుంటున్న డిఎస్‌టి బృందం సభ్యులు

25న ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్ ఆవిర్భావ వేడుకలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 23 : ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్ ఆవిర్భావ వేడుకలను ఈనెల 25న సాయంత్రం విద్యానగర్‌లో సిద్ధార్థ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. బృందావన్‌గార్డెన్స్‌లోని తేనీగ రెస్టారెంట్‌లో కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను శుక్రవారం ఆవిష్కరించి, వివరాలను వెల్లడించారు. అసోసియేషన్ స్థాపించి 55 వసంతాలు పూరైన సందర్భంగా ఈ వేడుకలను జరుపుతున్నట్టు వివరించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ప్రముఖ ప్రవచన కర్త గరికపాటి నరసింహారావు, టీడీపీ నాయకులు కంభంపాటి రామ్మోహనరావు, సినీ నిర్మాత చలసాని అశ్వినీదత్, సీనియర్ నటీ జయసుధ, దర్శకుడు వైవీఎస్ చౌదరి హాజరౌతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు జజ్జూరి మల్లికార్జునరావు, చిర్రావూరి సాంబశివరావు, దారపనేని శివప్రసాదు, కేతివల్లి సాంబశివరావు, ఎం.సుబ్బారావు, రావిపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

దాతల సాయాన్ని అందిపుచ్చుకోవాలి

● కేజేఎస్ఎస్ కార్యదర్శి చుక్కపల్లి రమేష్

గుంటూరు(తూర్పు), ఆగస్టు 23: దాతల సాయాన్ని అందిపుచ్చుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కమ్మజనసేవా సమితి కార్యదర్శి చుక్కపల్లి రమేష్ అన్నారు. స్థానిక కుందులరోడ్డు, కమ్మ బాలికల వసతి గృహంలో వసతి పొందుతున్న ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాలలో అభ్యసిస్తున్న నలుగురు విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున మొత్తం లక్ష రూపాయిలను ప్రవాసాంధ్రులు రావిపాటి శ్రీజ శుక్రవారం అందజేశారు. చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ రావిపాటి శ్రీజను స్ఫూర్తి తీసుకుని చదువులో రాణించాలని విద్యార్థినులకు సూచించారు. శ్రీజ మాట్లాడుతూ తాను చదువుకున్న కళాశాలపై మక్కువతో ఈ ఉపకార వేతనాలు అందిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో రావిపాటి సుభాష్, సమితి సంయుక్త కార్యదర్శి మర్రిపూడి సీతారామయ్య, పాలక వర్గ సభ్యులు పెద్ది సాంబశివరావు, ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాల కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉపకారవేతనాలు పొందిన విద్యార్థినులతో దాతలు, పాలకవర్గ సభ్యులు

బాధ్యతలు స్వీకరించిన వెస్ట్ డీఎస్పీ జయరాం ప్రసాద్



జయరామ్ ప్రసాద్

గుంటూరు ఆగస్టు 23 : వెస్ట్ డీఎస్పీగా నియమితులైన జయరాం ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వెస్ట్ సబ్ డివిజన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో కఠిన వైఖరి అవలంబించనున్నట్లు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులను సహించేది లేదన్నారు. అదేవిధంగా గంజాయి, డ్రగ్స్ తదితర మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన రేంజ్ ఐజీ త్రిపాఠి, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసారు.

స్పెషల్ బ్రాంచ్ సీఐగా ఆళహరి శ్రీనివాస్

జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐగా ఆళహరి శ్రీనివాస్‌ను నియమించారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఎస్‌బి -1 సీఐగా పని చేసిన వెంకట్రావు కొద్ది రోజుల క్రితం పిడుగురాళ్ళ సీఐగా నియమితులయ్యారు. అప్పటి నుంచి స్పెషల్ బ్రాంచ్ 2 సీఐ ఆనందరావు విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఎస్‌బి-1 సీఐగా ఆళహరి శ్రీనివాస్‌ను నియమించారు.

నిబంధనలు అతిక్రమించే ఆటో డ్రైవర్‌లపై కఠిన చర్యలు

నిబంధనలు అతిక్రమించే ఆటో డ్రైవర్‌లపై కఠిన చర్యలు తప్పవని ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ హెచ్చరించారు. ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఆటో స్టాండ్ యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్‌లకు, యజమానులకు శుక్రవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆటో డ్రైవర్లు రోడ్డు మీద ఎక్కడపడితే అక్కడ ఆపకుండా ఒక క్రమపద్ధతి పాటించాలన్నారు.

నగరంలో అర్ధరాత్రి వాహన తనిఖీలు

గుంటూరు నగరంలో శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు నాకాబందీ నిర్వహించారు. రాత్రి 11 గంటల నుంచి ఒంటి గంట వరకుఈ తనిఖీలు జరిగాయి. అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారందరినీ అదుపులోకి తీసుకున్నారు. ఆయా వాహనాలను సీజ్ చేసి, మందుబాబులను కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్పీ తెలిపారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు రక్షణ చర్యలు చేపట్టాలి

● కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు



కలెక్టరేట్‌లో జరిగిన పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్

గుంటూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రమాదకరమైన కేటగిరిలోని పరిశ్రమలలో దుర్ఘటనలను నివారించేందుకు యాజమాన్యాలు రక్షణ ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహణ చేసేలా సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ సమావేశమందిరంలో కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం జిల్లా ఇండస్ట్రీయల్ అండ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలలో రక్షణ ఏర్పాట్లను ఫ్యాక్టరీస్, కార్మిక శాఖ, విద్యుత్, అగ్నిమాపక శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తదితర శాఖలు నిర్వహించిన తనిఖీలలో పూర్తి వివరాలతో కూడిన నివేదిక అందించాలన్నారు. సమావేశంలో కోల్డ్ స్టోరేజీ, చిల్లీస్ వ్యాపారుల సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపిన అంశాలపై సంబంధిత శాఖల ద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 24 ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు ఇన్వెస్ట్మెంట్ సబ్సిడీ, రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ఇంట్రస్ట్ సబ్సిడీ, పవర్ కాస్ట్ సబ్సిడీకి సంబంధించి రూ.1,77,13,524 మంజూరు చేస్తూ సమావేశంలో కలెక్టర్ ఆమోదించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

సక్రమంగా ఇసుక బుకింగ్, రవాణ

● ప్రిన్సిపల్ సెక్రటరీకి నివేదించిన కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉచిత ఇసుక విధానానికి సంబంధించి వినియోగదారులకు ఇబ్బంది లేకుండా బుకింగ్, రవాణ సక్రమంగా జరిగేలా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ నాగలక్ష్మి రెవెన్యూ(ఎక్సైజ్), కామర్స్ (మైన్స్) శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనాకు నివేదించారు. శుక్రవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి ప్రిన్సిపల్ సెక్రటరీ మీనా జిల్లాలో ఉచిత ఇసుక విధానం అమలు, బుకింగ్‌పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశమందిరం నుంచి కలెక్టర్‌తో పాటు సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ ఈ సమావేశానికి హాజరయ్యారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఇసుక బుకింగ్‌కు సంబంధించి తుళ్ళూరు మండలం స్టాక్ యార్డు సమీపంలోని తుళ్ళూరు తహశీల్దారు కార్యాలయంలో, విజయవాడ వైపు వారికి తాడేపల్లి తహశీల్దారు కార్యాలయంలో, గుంటూరు నగర పరిసర ప్రాంతాల ప్రజల కోసం ఆర్డీవో కార్యాలయంలో ఇసుక బుకింగ్‌కు ఏర్పాట్లు చేయటం జరిగిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 640 మంది ఇసుక కోసం స్లాట్‌లు బుకింగ్ చేసుకున్నారని, శనివారం సాయంత్రానికి దాదాపు 450 మందికి ఇసుక అందించేలా స్లాట్ టైమింగ్‌లు కేటాయించటం జరిగిందని వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

ఐదేళ్లు పూర్తి చేసుకున్న సిబ్బందికి స్థానచలనం

● కౌన్సెలింగ్‌లో ఆయా స్టేషన్‌లు కేటాయించిన ఎస్పీ

గుంటూరు, ఆగస్టు 23 : జిల్లాలో ఒకే పోలీస్ స్టేషన్‌లో ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న పోలీస్ సిబ్బందికి స్థానచలనం కల్పించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పోలీస్ కార్యాలయంలోని గ్రివెన్స్ హాల్లో పోలీస్ సిబ్బందికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్ళకు వేరే సబ్ డివిజన్ పరిధిలో ఆయా సిబ్బంది కోరుకున్న పోలీస్ స్టేషన్లను కేటాయించారు. బదిలీల కార్యక్రమం పూర్తయిన అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలోని స్పందన కాన్ఫరెన్స్ హాలులో బదిలీలపై వెళ్తున్న సిబ్బందితో ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ బదిలీపై ఆయా స్టేషనులకు వెళుతున్న పోలీస్ సిబ్బంది నిబద్ధతతో బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల సమాచారం ఉన్నట్లయితే ముందుగా సంబంధిత అధికారులకు తెలియపరిచి వాటిని అరికట్టే దిశగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా అడ్మిన్ అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, డిస్ట్రిక్ పోలీస్ కార్యాలయ ఏఓ వెంకటేశ్వరరావు, ఎస్పీ సీసీ ఆదిశేషు, కార్యాలయం సిబ్బంది, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఆనంద్, అడ్మిన్ ఆర్ఐ బ్రహ్మానందం, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ భార్గవ తేజ

భూముల మార్కెట్ విలువ పెంపునకు కసరత్తు : జేసీ

గుంటూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా భూముల మార్కెట్ విలువ పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. అందులో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ మీటింగ్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ తేజ అధ్యక్షతన తొలి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి గుంటూరు ఆర్‌డీవో, జిల్లా రిజిస్ట్రార్, పంచాయతీ అధికారి, పట్టణ ప్రణాళికాధికారి, తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయం సిబ్బంది హాజరయ్యారు. జేసీ భార్గవతేజ మాట్లాడుతూ భూముల మార్కెట్ విలువ పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందుకు సంబంధించి అవసరమైన సూచనలను అందించాలన్నారు.

ఎరువుల కంపెనీల ప్రతినిధులతో వ్యవసాయ శాఖ సమీక్ష

గుంటూరు సిటీ, ఆగస్టు 23 : జిల్లాలో ఎరువుల సరఫరాపై జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు ప్రముఖ ఎరువుల తయారీదారులతో సమావేశం నిర్వహించారు. శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి ఛాంబర్‌లో జరిగిన సమావేశానికి ఇఫ్కో, క్రిభకో, కోరమండల్, నాగార్జున, స్పిక్, మంగుళూరు కెమికల్, పి.పి.యల్ కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. జిల్లాలో ఇప్పటి వరకు 83 వేల 400 హెక్టార్లులలో వివిధ పంటలు సాగు చేసినట్లు వ్యవసాయ అధికారి తెలిపారు. 34203 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాలో అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాకు ఆగస్టు,సెప్టెంబర్ మాసంలో సరఫరా చేయవలసిన ఎరువుల లభ్యతపై జిల్లా వ్యవసాయ అధికారి కంపెనీల ప్రతినిధులను ప్రశ్నించారు. వారు మాట్లాడుతూ కావలసిన యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ కాకినాడ, గంగవరం, వైజాగ్, కృష్ణపట్నం పోర్ట్‌లలో లభ్యత ఉన్నట్లు తెలిపారు. ఆగస్టు మాసంలో ఇప్పటి వరకు 1650 మెట్రిక్ టన్నుల యూరియా , 2225 మెట్రిక్ టన్నుల డి ఏ. పి, జిల్లాకు రావడం జరిగినదని, మరో 2600 మెట్రిక్ టన్నుల యూరియా ,1300 మెట్రిక్ టన్నుల డీఏపీ జిల్లాకు రానుందని తెలిపారు. ఈ సమావేశంలో ఏవో గౌతమ్ ప్రసన్న పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజనం చేసే విద్యార్థుల సంఖ్య పెరగాలి : డీఈవో

గుంటూరు(విద్య), ఆగస్టు 23 : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేసే విద్యార్థుల సంఖ్య పెంచేలా ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు కృషి చేయాలని డీఈవో పి.శైలజ సూచించారు. చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజనం పథకం సమర్థవంతంగా అమలు చేయాలని, నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. హెచ్‌ఎం ఎస్‌కెఎండి ఖాసిం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 23: స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో నేటి నుంచి మూడు రోజుల పాటు జరిగే హిందు కళాశాల మాజీ పీ డీ పసుపులేటి యడ్ల రాజ్యలక్ష్మీ స్మారక బాస్కెట్‌బాల్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పోటీలను సీనియర్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు జేవీ వెంకటరమణ, స్థానిక టీడీపీ కార్పొరేటర్ వేములపల్లి శ్రీరామ్‌ప్రసాదు, పాటిబండ్ల సీతారామయ్య పాఠశాల కార్యదర్శి పాటిబండ్ల విష్ణువర్థన్, టీడీపీ నాయకుడు ముత్తినేని రాజేష్ ప్రారంభించారు. పోటీలలో 12 పురుషుల జట్లు, 5 మహిళల జట్లు పాల్గొనన్నుట్టు పోటీ నిర్వాహకుడు వీవీఐటీ ఫిజికల్ డైరక్టర్ ఎన్ అరుణ్‌కుమార్ తెలిపారు.

25న బీపీ మండల్ జయంతి వేడుకలు

గుంటూరు(విద్య), ఆగస్టు 23 : బీపీ మండల్‌సేన ఆధ్వర్యంలో ఈనెల 25న బీపీ మండల్ జయంతి నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు తెలిపారు. వేడుకల్లో పాల్గొనేందుకు డిఎంకె రాజ్యసభ సభ్యులు పి.విల్సన్ హాజరుకానున్నట్లు తెలిపారు. అమరావతి రోడ్డులోని బీపీ మండల్ విగ్రహం వద్ద నివాళులర్పించిన తరువాత బండ్లమూడి గార్డెన్స్‌లో సభ నిర్వహించనున్నట్లు చెప్పారు.

శ్రావణ శుక్రవార విశేష పూజలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 23 : స్థానిక అరండల్‌పేట శ్రీ అష్టలక్ష్మి సమేత శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వారి దేవస్థానంలో ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాదు ఆధ్వర్యంలో శ్రావణ మాస కోటి కుంకుమార్చన మహోత్సవాలలో భాగంగా శ్రావణ శుక్రవార పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఉదయం గోపూజ, శ్రీ చక్ర మేరుకు విశేష అభిషేకార్చనలు జరిగాయి. అనంతరం వరలక్ష్మి అమ్మవారికి 108 బంగారు పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● స్థానిక ఏటుకూరు రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని శ్రావణ శుక్రవార పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. కన్యకా పరమేశ్వరిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వేదమంత్రాలతో సువాసినులచే కుంకుమ పూజలు, పారాయణలు విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, వేద పండితులు, ఆలయ ఈవో తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక సిద్ధార్థనగర్ శ్రీ కనకమహాలక్ష్మి మందిరం వ్యవస్థాపకులు ఘంటసాల విజయస్వామి ఆధ్వర్యంలో శ్రావణమాస పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని లక్ష్మీదేవిగా విశేషంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో వేదమంత్రాలతో సువాసినులచే కుంకుమ పూజలు, పారాయణలు, విశేష పూజలు నిర్వహించారు.

శ్రావణ అమ్మవారి సారెతో శోభాయాత్ర

గుంటూరు(తూర్పు), ఆగస్టు 23: స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, పద్మావతి కల్యాణమండపం వేదికగా శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి సారె శోభాయాత్ర భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆలయ ప్రధాన పూజారి మాధవస్వామి నిర్వహణలో శోభాయాత్రగా ఆలయం నుంచి ధార్మిక ప్రాంగణం అనంతరం పురవీధులలో తిరిగి ఆలయం చేరుకొని అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చనలు, లలితసహస్ర నామ పారాయణ విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, గళ్లా రామచంద్రరావు, ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ, బొర్రా ఉమామహేశ్వరరావు, పి.ప్రభాకరరావు, వూటుకూరి నాగేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వర్లు, హనుమంతరావు పాల్గొన్నారు.



అమ్మవారి సారెతో ఎమ్మెల్యే గళ్లా మాధవి, ఆలయ కమిటీ సభ్యులు

ఆందోళన విరమించిన జూనియర్ డాక్టర్లు

గుంటూరు (మెడికల్) ఆగస్టు 23: గత రెండు వారాలుగా విధులు బహిష్కరించిన ఆందోళన బాట పట్టిన గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రికి చెందిన జూనియర్ డాక్టర్లు ఎట్టకేలకు శుక్రవారం సమ్మె విరమించారు. జూడాలకు, వైద్యులకు తగిన రక్షణ వ్యవస్థ కల్పిస్తామని, దోషులపై కఠిన శిక్ష విధిస్తామని దేశ అత్యున్నత న్యాయం స్థానం హామీ ఇవ్వడం, మన రాష్ట్రంలో మెడికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌ను కఠినంగా అమలు చేసి వైద్యులపై దాడి చేసే వారికి ఏడేళ్ల జైలుశిక్ష విధించేలా చట్టం అమలు చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇవ్వడంతో సమ్మె విరమించారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (ఆజుడా) రాష్ట్ర అధ్యక్షుడు, గుంటూరు జీజీహెచ్ ట్రైనీ పీజీ డాక్టర్ దీక్షిత్ పెంద్యాల శుక్రవారం సాయంత్రం ప్రకటించారు. వెంటనే విధులకు హాజరవుతున్నట్లు తెలిపారు. జూడాల సమ్మె విరమణ ప్రకటనపై ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ హర్షం ప్రకటించారు. తొలుత జూనియర్ డాక్టర్లు శుక్రవారం ఉదయం తమ నిరసన కొనసాగించారు. సాముహికంగా జూడాలు రక్తదానం చేశారు.

ప్రభుత్వాస్పత్రిలో మూడు సీటీ స్కాన్ మెషిన్లు

గుంటూరు ప్రభుత్వ సమగ్రా స్పత్రిలో రోగుల రద్దీని తట్టుకొని సరైన వైద్యసేవలు అందించే క్రమంలో మూడు సీటీ స్కాన్ మెషిన్లు అందుబాట్లోకి వచ్చాయి. ఇటీవల రూ.4 కోట్లు వెచ్చించి కొత్తగా కొనుగోలు చేసి సర్వీస్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన నూతన సీటీ స్కాన్ మెషిన్‌తోపాటు నాట్కో కేన్సర్‌సెంటర్‌లో మరో సీటీస్కాన్ రోగులకు అందుబాటులో ఉంది. అందుబాట్లోకి వచ్చిన మూడో మెషిన్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు.

నాట్కోలో కొలొస్టమీ సెంటర్..

ప్రభుత్వ సమగ్రాస్పత్రి నాట్కో కేన్సర్ కేంద్రంలో రాష్ట్రంలో తొలిసారిగా కొలొస్టమీ సెంటర్‌ను సూరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ టీవీ శివరామకృష్ణ, డాక్టర్ వెంకటరెడ్డి, యడ్లపాటి అశోక్‌కుమార్, సురేష్, శేషేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభను సద్వినియోగం చేసుకోవాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 23: గుంటూరు రూరల్ పరిధిలో లాల్‌పురంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. సభకు ముఖ్య అతిదిగా అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాధ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని వివిధ రకాల సమస్యలను జనసేన, టీడీపీ నేతలతో పాటు ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. మండల స్పెషల్ ఆఫీసర్ వజ్రశ్రీ, ఎంపీడీవో ఆదినారాయణ పశ్చిమ ఎమ్మార్వో ఫణీంద్ర, గ్రామ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఏపీ ఓ పీ ఆర్ రమేష్, గ్రామ స్థాయి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

31న కార్పొరేషన్ ప్రత్యేక కౌన్సిల్ సమావేశం

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 23 : గుంటూరు నగరపాలక సంస్థ ప్రత్యేక కౌన్సిల్ సమావేశాన్ని ఈనెల 31న నిర్వహిస్తున్నట్లు కౌన్సిల్ సెక్రటరీ, డిసి శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నగర మేయర్ మనోహర్ నాయుడు అధ్యక్షతన ప్రత్యేక కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.



పురస్కార గ్రహీతలతో హైకోర్టు న్యాయమూర్తి బొప్పూడి కృష్ణమోహన్

త్యాగశీలి.. టంగుటూరి ప్రకాశం

●హైకోర్టు న్యాయమూర్తి బొప్పూడి కృష్ణమోహన్

●వేడుకగా అమరావతి తెలుగు వెలుగులు పురస్కార ప్రదానోత్సవం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 23: టంగుటూరి ప్రకాశం పంతులు త్యాగశీలి అని, ఆంధ్రుల గౌరవాన్ని నిలబెట్టిన ఒక నాయకుడుని హైకోర్టు న్యాయమూర్తి బొప్పూడి కృష్ణమోహన్ కొనియాడారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం, యువకళా వాహిని ఆధ్వర్యంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి ఉత్సవాల సందర్భంగా జరిగిన అమరావతి తెలుగు వెలుగులు పురస్కారాల ప్రదానోత్సవ సభ వేడుకగా నిర్వహించారు. సభకు యువకళావాహిని ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బొప్పుడి కృష్ణమోహన్ మాట్లాడుతూ నేటి యువత టంగుటూరి ప్రకాశం పంతులును స్ఫూర్తిగా తీసుకొని దేశంకోసం ముందుకు సాగాలన్నారు. అనంతరం ముఖ్య అతిధులుగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బిజి పార్థసారధి, సభాధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, బార్ కౌన్సిల్ సభ్యుడు వట్టి జొన్నల బ్రహ్మారెడ్డి, రామరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సిద్దేంద్ర ఆర్ట్స్ అకాడమి నిర్వాహకులు డాక్టర్ దేవసేనతో కలసి ఆయన పురస్కారాలకు ఎంపికైన రంగస్థల నటుడు, దర్శకుడు తాళా బత్తుల వెంకటేశ్వరరావు, నాట్య గురువు డాక్టర్ కాజా వెంకట సుబ్రహ్మణ్యం, రచయత షేక్ అబ్దుల్ హకీంజాని, వ్యాఖ్యాత ఏవైకే సుజాత, సంగీతంలో ఏంవై శేషురాణిలకు పురస్కారాలను అందజేశారు. యువ కళావాహిని సభ్యులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ

ప్రకాశం పంతులకు ఘన నివాళి

గుంటూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా తుపాకికి ఎదురుగా గుండె ఉంచి తెల్లదొరల ముందు ధైర్యసాహసాలను ప్రదర్శించిన వీరోచిత పోరాటయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని కలెక్టర్ నాగలక్ష్మి కీర్తించారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశం మందిరం లో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ తేజ టంగుటూరి ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజ, ఉపాధి అధికారి, ఇంచార్జ్ జిల్లా బిసి సంక్షేమాధికారి రఘు పాల్గొన్నారు.

● గుంటూరు నగరంలోని 53వ డివిజన్‌లో ఉన్న వెంగళరావునగర్ బాలికోన్నత పాఠశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పి రమేష్, 53వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు గుడిమెట్ల దయారత్నం, గుంటూరు వాసవి క్లబ్ అధ్యక్షుడు నగేష్ కుమార్ సోషల్ టీచర్ ఉమామహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

● గుంటూరు, ఆగస్టు 23 : రేంజి ఐజీ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి రేంజ్ ఐ.జి. సర్వశ్రేష్ఠ త్రిపాఠి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేటి యువత ప్రకాశం పంతులు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన అడుగు జాడల్లో నడవాలని ఆకాంక్షించారు.



నివాళులర్పిస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

జిల్లా జైలులో శుక్రవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు జరిగాయి. ప్రకాశం పంతులు జీవిత విశేషాలు, స్వాతంత్ర్య పోరాటంలో అయన చూపిన ధైర్య సాహసాలు గురించి కారాగారం పర్యవేక్షణాధికారి కె.రఘు వివరించారు. ఈ కార్యక్రమంలో జైలర్లు బి.తేజేశ్వరరావు, సిహెచ్ కిరణ్, డిప్యూటీ జైలర్లు ఎ.కళ్యాణ్ బాబు, కె.అశోక్, బి. శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

● ఉమ్మడి రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషి చేసిన మహనీయుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని శాసనమండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి కీర్తించారు. ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం శుక్రవారం శంకర్‌విలాస్ సెంటర్‌లో ఆంధ్రకేసరి అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. అప్పిరెడ్డి మాట్లాడుతూ ఎలా పాలించాలో ఆచరణలో చేసి చూపిన గొప్ప పరిపాలనా దక్షుడని కొనియాడారు. గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనా థ్, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి మేరుగ నాగార్జున, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, కార్పొరేటర్లు అంబేద్కర్, దూపాటి వంశీ, షేక్ రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ బత్తుల దేవానంద్, గీతామందిరం ఛైర్మన్ వి.రత్నప్రసాద్, విజయ మాధవి, కొత్తపేట సతీశ్, సింగు నరసింహారావు, ఆలా కిరణ్, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

● అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం జరిగింది. విద్యావేత్త ఆర్‌వీ సింగరయ్య, కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ ప్రకాశం పంతులు దేశభక్తి, నిష్కలంక వ్యక్తిత్వం భావితరాలకు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో ఇంజనీర్ ఎన్ సదాశివం, అనీల్‌కుమార్ తదితరులున్నారు.

డాక్టర్ పీఎన్ఎస్ చంద్రబోస్ సేవలు మరువలేనివి



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న అప్పారావు తదితరులు


గుంటూరు(తూర్పు), ఆగస్టు 23 : సామాజిక బాధ్యతతో సమాజానికి డాక్టర్ పిఎన్ఎస్ చంద్రబోస్ అందించిన సేవలు మరువలేవని టీడీపీ సీనియర్ నాయకుడు, 28వ డివిజన్ అధ్యక్షుడు ఏ.అప్పారావు అన్నారు. స్థానిక సీతమ్మ కాలనీలోని జీహోవా షాలోమ్ చర్చి ప్రాంగణంలో శుక్రవారం డాక్టర్ చంద్రబోస్ జయంతి ఘనంగా నిర్వహించారు. గాస్పెల్ మిషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వికాస్ ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అప్పారావు మాట్లాడుతూ శివారు కాలనీల్లో ఉన్న విద్యార్థులకు ఉచిత విద్యను అందించడానికి డాక్టర్ చంద్రబోస్ కృషి చేసారని గుర్తు చేశారు. జీహోవా షాలోమ్ చర్చి పాస్టర్ పి జీవన్ మాట్లాడుతూ డాక్టర్ చంద్రబోస్ ఆశయాలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యురాలు లీలా చంద్రబోస్, వికాస్ ఆస్పత్రి డాక్టర్లు నిహారిక, సుధాకర్, సురేంద్ర, పవన్, శివరంజిత్, షాలినా, మేనేజ్‌మెంట్ సీఈవో మూర్తి, ప్రణీత్ పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలి

గుంటూరు, ఆగస్టు 23 : ఏటుకూరు రోడ్డు చాకలిగుంట, గాంధీనగర్ రెండో లైను వద్ద ఉన్న అంబేద్కర్ ఎలిమెంటరీ పాఠశాల సమీపంలో, ఆలయానికి పక్కనే ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే అక్కడ నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్‌యూఐ నాయకులు నిరసన తెలిపారు. వెంటనే అక్కడ నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని కొద్దిసేపు విద్యార్థులతో కలిసి ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ నగర ఇన్‌ఛార్జ్ ఏసురాజు, నాయకులు సుమంత్, మదన్, కుమార్‌రాజు, సాదిక్, ఇస్రాయిల్ తదితరులున్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
శనివారం • 24 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com

మహేశ్ సినిమా పేరు అదేనా?



మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో డా.కె.ఎల్.నారాయణ నిర్మించే చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మహేశ్ పుట్టినరోజున సినిమాకు సంబంధించిన అప్‌డేట్ వస్తుందని ఆశగా ఎదురు చూసిన ఆయన అభిమానులు ఏదీ రాకపోవడంతో నిరాశకు గురయ్యారు. యాక్షన్ అడ్వెంచర్‌గా ఈ సినిమా ఉంటుందన్న సమాచారం తప్ప కొత్త వార్తలేమీ బయటకు రావడం లేదు. సినిమా టీమ్ మాత్రం ప్రీ ప్రొడక్షన్ వర్క్‌లో సీరియస్‌గా నిమగ్నమై ఉంది. ఇటువంటి నేపథ్యంలో ఒక ఆసక్తికరమైన వార్త బయటకు వచ్చింది. విజువల్ డెవలప్‌మెంట్ ఆర్టిస్ట్ టీపీ విజయన్ తన ఇన్‌స్టా స్టోరీస్‌లో బంగారు వర్ణంలో ఉన్న గద్ద రెక్కలు ఉంచి మహేశ్ సినిమా టైటిల్ ఇదే అని అర్థం వచ్చేలా పోస్ట్ చేయడంతో అభిమానుల్లో చర్చ మొదలైంది. ఈ సినిమాకు 'గరుడ' అనే టైటిల్ పెట్టవచ్చు అనే ఊహాగానాలు ఊపందుకొన్నాయి. గతంలో దర్శకుడు రాజమౌళి 'బాహుబలి' తర్వాత తను చేయబోయే ప్రాజెక్ట్ 'గరుడ' అని వెల్లడించారు. ఆ ప్రాజెక్ట్ ఇదే అయి ఉంటుందని, సినిమాకు 'గరుడ' అని పేరు పెడతారని సోషల్ మీడియాలో కామెంట్స్ పెడుతున్నారు. మహేశ్ చిత్రానికి 'గరుడ' టైటిల్ ఖాయమో కాదో అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

రవితేజకు శస్త్ర చికిత్స




హీరో రవితేజ కుడిచేతికి సర్జరీ జరిగింది. చికిత్స చేసిన వైద్యులు ఆయనని ఆరు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. 'ఆర్‌టీ75' సినిమా చిత్రీకరణలో రవితేజకు ఇటీవలే స్వల్ప గాయమైంది. ఆ గాయాన్ని లెక్కచేయకుండా షూటింగ్‌లో పాల్గొన్నారు. దాంతో ఆ గాయం మరింత పెద్దదవ్వడంతో డాక్టర్లు సర్జరీ చేశారు. కాగా, 'సామజవరగమన' చిత్రానికి రచయితగా పనిచేసిన భాను భోగవరపు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు.

సమంతకు ఏమైంది?



సిటాడెల్ వెబ్‌సిరీస్ ఇండియన్ వెర్షన్ 'హనీ బన్నీ'తో ప్రేక్షకులను పలకరించనున్నారు సమంత. ఆమె సినిమాలు తగ్గించినా.. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో టచ్‌లో ఉంటున్నారు. అలానే అప్పుడప్పుడు పలు ఈవెంట్లలో పాల్గొని ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తుంటారు. అయితే ఇటీవల ముంబైలో జరిగిన ఓ కార్యక్రమానికి సమంత బ్లాక్ డ్రస్సులో వచ్చారు. ఈ సందర్భంగా తీసుకున్న వీడియోను ఆమె అభిమానులతో సోషల్‌మీడియాలో పంచుకున్నారు. ఇక అప్పటి నుంచి అభిమానుల కామెంట్లు మొదలైయ్యాయి. 'సమంతకు ఏమైంది... ఆమె మునుపటిలా ఎందుకు అందంగా కనిపించట్లేదు. బరువు తగ్గినట్టుంది. ముఖంలో ఆనందం కనిపించట్లేదు' అని పలువురు అభిమానులు ఆందోళన వ్యక్తం చేశారు.

అలా కామెంట్ చేసినందుకు చింతిస్తున్నా



హీరో నాని నటించిన తాజా చిత్రం 'సరిపోదా శనివారం'. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఓ మీడియా సమావేశంలో పాల్గొన్న ఆయన ప్రభాస్‌పై అర్షద్ వార్సీ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. 'ఆ వ్యాఖ్యల వల్ల అర్షద్‌కు ఎప్పుడూ రానంత ఫేమ్ వచ్చింది" అని అన్నారు. అయితే ఇప్పుడా మాటలు సోషల్‌మీడియాలో హాట్ టాపిక్కయ్యాయి. ఆ మాటల వల్ల సోషల్‌మీడియాలో అభిమానులు నాని వర్సెస్ అర్షద్ అంటూ రెండు వర్గాలుగా చీలిపోయారు. తాజాగా, 'సరిపోదా శనివారం' ప్రమోషన్స్ కోసం ముంబై వెళ్లిన నాని.. తాను అర్షద్‌పై చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. "అర్షద్ చాలా గొప్ప నటుడు. ఆయన గురించి అలా మాట్లాడినందుకు బాధపడుతున్నాను. నటులుగా ఉన్నప్పుడు మాట్లాడే ప్రతీ మాట విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. లేదంటే అవి వైరల్ అయ్యి ప్రమాదంగా మారే అవకాశం ఉంది. ఇప్పుడు ప్రభాస్‌పై అర్షద్ చేసిన వ్యాఖ్యల్లో.. అర్షద్‌పై నేను చేసిన వ్యాఖ్యల్లో ఆ పొరపాటే జరిగింది. నిజానికి నేను అర్షద్‌ని అలా అనాలనుకోలేదు. నా మాటలు సోషల్‌మీడియా ద్వారా అలా తప్పుదోవ పట్టాయి. నేను ఆయనపై అలా మాట్లాడినందుకు వచ్చిన రియాక్షన్స్‌ను చూసి అర్షద్ పూర్తి ఇంటర్వ్యూ చూశాను. అందులో ఆయన మాట్లాడిన మాటలు తప్పుదోవ పట్టాయని అర్థమైంది. అదే విధంగా నా వ్యాఖ్యలు కూడా మరో రకంగా ప్రజల్లోకి వెళ్లాయి" అని పేర్కొన్నారు.

హేమపై నిషేధాన్ని తొలగించిన 'మా'



నటి హేమ ఊపిరి పీల్చుకున్నారు. ఆమెపై 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) నిషేధాన్ని తొలగించింది. 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు ఆదేశాల మేరకు ఎగ్జిక్యూటివ్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. మేలో జరిగిన ఓ రేవ్ పార్టీలో ఆమె డ్రగ్స్ తీసుకుందని.. పోలీసులు నిర్వహించిన డ్రగ్స్ టెస్టులో నిర్ధారణ కావడంతో ఆమెపై 'మా' సస్పెన్షన్ విధించింది. అయితే ఆమె అందులో నిరపరాధినని పేర్కొంటూ.. ఓ ల్యాబ్‌లో మెడికల్ టెస్టులు చేసుకుని ఆ నివేదికల్ని మంచు విష్ణుకు ఓ లేఖతో పాటు అందించారు. ఈ అంశాలన్నింటినీ పరిశీలించిన 'మా' ఆమెపై సస్పెన్షన్‌ను ఎత్తివేశారు.

సినీటాకు మంచు విష్ణు లేఖ

ప్రభాస్‌పై బాలీవుడ్ అర్షద్ వార్సీ చేసిన వ్యాఖ్యలు ఎంతటి దుమారాన్ని రేపాయో తెలిసిందే. ఈ వివాదంపై స్పందిస్తూ.. మంచు విష్ణు 'మా' తరపున 'సినీటా' (సినిమా అండ్ టీవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) అధ్యక్షురాలు పూనమ్ థిల్లాన్‌కు లేఖ రాశారు. "ప్రతీ ఒక్కరికి నచ్చినట్లు మాట్లాడే స్వేచ్ఛ ఉంది. కానీ ప్రభాస్‌ని కించపరుస్తూ అర్షద్ చేసిన వ్యాఖ్యల వల్ల అభిమానుల మనోభావాలు దెబ్బతిన్నాయి. సినీనటుల ఐక్యత, గౌరవాన్ని కాపాడటంలో ఎల్లప్పుడూ ముందుండే 'సినీటా'.. ఈ వివాదంపై స్పందిస్తుందని ఆశిస్తున్నాను. ఇలాంటి వ్యాఖ్యలు భవిష్యత్తులో మరోసారి పునరావృత్తం కాకుండా తగిన సూచనలు అర్షద్‌కు చేస్తారని ఆశిస్తున్నాను. మనమంతా ఒకే కుటుంబం. ఆ ఐక్యతను కొనసాగిద్దాం" అని లేఖలో పేర్కొన్నారు.

'ఎమర్జెన్సీ'ని బ్యాన్ చేయాల్సిందే!

సిక్కుల డిమాండ్



కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రం ఇప్పుడు మరో వివాదంలో చిక్కుకుంది. సెప్టెంబర్ 6న ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. అయితే సిక్కుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా 'ఎమర్జెన్సీ' చిత్రం ఉందనీ, సిక్కులకు వ్యతిరేకంగా రూపుదిద్దుకున్న ఈ సినిమాను వెంటనే బ్యాన్ చేయాలనీ, విడుదల చేయడానికి వీల్లేదని శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ (ఎస్‌జీపీసీ) అకల్ తక్త్ డిమాండ్ చేశాయి. ఎస్‌జీపీఎస్ చీఫ్ హర్‌జిందర్ సింగ్ ధామి ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి కంగనను తీవ్రంగా విమర్శించడమే కాకుండా ఆమెపై కేసు పెట్టాలని కూడా కోరారు. సిక్కులను వ్యతిరేకించే సన్నివేశాలు ఈ మధ్య సినిమాల్లో ఎక్కువ అయ్యాయనీ, అందుకే సెన్సార్‌బోర్డ్‌లో సిక్కులకు కూడా తగినంత ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. 'ఎమర్జెన్సీ' చిత్రం తీస్తున్నట్లు 2021లో కంగనా ప్రకటించినప్పటి నుంచీ ఈ సినిమాకు చిక్కులే. ఇందులో ఆమె మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పాత్రను పోషిస్తూ, దర్శకత్వం వహించారు. ఇది ఇందిరా గాంధీ బయోపిక్ కాదనీ, ఓ పొలిటికల్ డ్రామా అని ఎన్నో సార్లు కంగనా వెల్లడించానా వివాదాలు ఈ సినిమాను వదలేదు. ఎన్నో అవరోధాలు తట్టుకుని, విడుదలకు సిద్ధం చేస్తే ఇప్పుడు సిక్కుల నుంచి కంగనాకు ప్రతిఘటన ఎదురైంది.

పెళ్లిపీటలపై మరో హీరోయిన్!



తెలుగు హీరోయిన్లు వరుసగా పెళ్లి పీటలు ఎక్కుతున్నారు. హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ రహస్య గోరఖ్ పెళ్లి అయిన రోజునే అంటే గురువారం రాత్రే మరో హీరోయిన్ మేఘా ఆకాశ్, ఆమె చిరకాల ప్రియుడు సాయివిష్ణుల నిశ్చితార్థం కేరళలో జరిగింది. తమకు ఎంగేజ్‌మెంట్ జరిగిన విషయాన్ని గురువారం అర్థరాత్రి వెల్లడించి, ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ చేసింది మేఘా ఆకాశ్. పెళ్లి ఎప్పుడన్నది మాత్రం ఆమె పేర్కొనలేదు. సాయివిష్ణు, మేఘా ఆకాశ్ ఆరేళ్లుగా ప్రేమలో ఉన్నారట.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ శేషన్న

పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించండి

● పట్టణ మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట ఆగస్టు 23: పట్టణంలో పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని శానిటేషన్ అధికారులను పట్టణ మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. స్థానిక 17వ వార్డులోని పోలమ్మ వీధిలో జరుగుతున్న పారిశుధ్య పనులను శుక్రవారం కమిషనర్ పరిశీలించి శానిటేషన్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశల మేరకు పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. వార్డు ప్రజలు చెత్తను, వ్యర్థాలను మురుగు కాలువలో వేయరాదని, పారిశుధ్య కార్మికులకు అందించాలని తెలిపారు. డ్రెయిన్‌లను, మురుగు కాల్వలను అక్రమించారాదని, సుందర తెనాలికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరరాల పరిశుభ్రతను అందరూ పాటించాలని కోరారు. అనంతరం తాగునీటి శాంపిల్స్‌ను సేకరించి పరీక్షలను నిర్వహించారు. మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ తదితరులు

ఆదర్శనీయుడు టంగుటూరి ప్రకాశం పంతులు

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట ఆగస్టు 23: స్వాతంత్ర సమరయోధుడు, ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శనీయ రాజకీయవేత్త అని పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. పట్టణంలోని పురపాలక సంఘ కౌన్సిల్ హాల్లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతిని పురపాలక సంఘ అధికారులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పాల్గొని టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టిన ప్రకాశం పంతులు వారాలు చేసుకుంటూ చదువుకొని, స్వాతంత్ర పోరాటాలలో పాల్గొన్నారన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. ఆంధ్ర రాజకీయాలలో ప్రముఖంగా వెలుగొందిన వారిలో ప్రకాశం పంతులు ఒకరని, నేటి యువత అలనాటి ప్రకాశం పంతులు రాజకీయ జీవనాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ బీ. శేషన్న, ఎంఎచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, పలుశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలి అర్బన్ : ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి శుక్రవారం పాఠశాలలు, కళాశాలలలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చినరావూరు ఐటీఐలో ప్రిన్సిపాల్ రావి చినవెంకటేశ్వర్లు మాట్లాడుతూ, రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా పని చేశారని అభివృద్ధికి బాటలు వేశారని, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని త్యాగం చేసిన ప్రకాశం చిరస్మరణీయులని అన్నారు. కార్యక్రమంలో రామారావు, శ్యాంసుందర్, బాషా, తదితరులు పాల్గొన్నారు.

తెనాలి రూరల్: ప్రజాహిత తత్పరుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని, ఆయన ఆశయాలను నేటి తరం అందిపుచ్చుకుని ఆదర్శవంతమైన జీవనాన్ని అలవరచుకోవాలని తహసీల్దార్ గోపాల కృష్ణ అన్నారు. శుక్రవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి తహసీల్దార్ గోపాలకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన పోరాటాలను, దేశం కోసం ఆయన ఆస్తిపాస్తులను ఖర్చుచేసిన విధానాన్ని, సేవాగుణాన్ని , పోరాటపటిమను మననం చేసుకున్నారు. కార్యక్రమంలో కార్యలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఫ్రైడే డ్రైడే ర్యాలీని నిర్వహిస్తున్న మున్సిపల్ హెల్త్ అధికారులు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల

తెనాలి, మారీసుపేట ఆగస్టు 23: పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ కారుమూరి హెలెన్ నిర్మల కోరారు. స్థానిక నాజరుపేట జంపని కాలువ ప్రాంతంలో శుక్రవారం మలేరియా అధికారులు దోమల ద్వారా వ్యాపించే వివిధ రకాల వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ కారుమూరి హెలెన్ మాట్లాడుతూ దోమలు ప్రజారోగ్యానికి ప్రథమ శత్రువని, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేను పాటించాలని, నీటి నిల్వలు లేకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. చిన్న దోమ పెను ప్రమాదమని, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రం పాటించాలని, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని, నిల్వ ఉన్న ఆహార పదార్థాలు తినరాదని తెలిపారు. అనంతరం ఫ్రైడే డ్రైడే అవగాహన ర్యాలీని డాక్టర్ హెలెన్ నిర్మల ప్రాంభించారు. కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ బీబీజాన్, ఆరోగ్య విస్తరణాధికారి చంద్రమౌళి, పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, గ్రామీణ సబ్ యూనిట్ అధికారి గుద్దంటి రవికుమార్, శానిటరీ సెక్రటరీ లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్స్ నవీద్, రషీద్, రత్నాకర్, బాషీద్, సచివాలయ ఆరోగ్య కార్యదర్శి వాత్సల్య, ఆషాకార్యకర్తలు సంధ్య, ఝాన్సి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

తెనాలి, మారీసుపేట ఆగస్టు 23: స్థానిక చెంచుపేటలోని జేఎంజే కళాశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమాన్ని కళాశాల భౌతిక శాఖ విభాగం వారు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీబీఎస్ కళాశాల అధ్యపకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రయాన్ 3 మిషన్ 23వ తేది ఆగస్టు 2023 చంద్రుని ఉపరితలంపై విక్రమ్ ల్యాండర్‌ను సురక్షితంగా ల్యాండింగ్ అవడం గురించి, చంద్రుని దక్షిణ ధ్రువ ప్రాంతానికి సమీపంలో ల్యాండ్ అయిన మొదటి దేశంగా భారత్ పేరు గాంచిందని అన్నారు. సాఫ్ట్ ల్యాండింగ్ తరువాత ప్రజ్ఞాన్ రోవర్ విజయవంతంగా విస్తరణ జరిగిందన్నారు. ల్యాండింగ్ సైట్‌కు భారత ప్రధాని నరేంద్ర మోదీ శివశక్తి పాయింట్ అని పేరు పెట్టారని తెలిపారు. ఆర్బిటర్, ల్యాండింగ్, రోవర్ ఏవిధంగా అంతరిక్షంలో చంద్రుని కక్షలో తిరుగుతుంటాయో వివరించారు. రానున్న రోజులలో మీరు మంచి సైంటిస్టులుగా ఎదగాలని విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షైనీ, వైస్‌ప్రిన్సిపాల్ శారద, భౌతిక శాస్త్ర శాఖాధిపతి అనిల్, అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

● రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు గ్రామ సభలు హర్షణీయం
● సర్పంచ్‌ల అధికారాలను హరించిన వైసీపీ
● అధికారంతో పాటు నిధులను విడుల చేసిన కూటమి
● పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్



గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరుటౌన్(చేబ్రోలు), ఆగస్టు 23: గ్రామ పంచాయతీల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం చేబ్రోలు నిర్వహించిన గ్రామ సభలో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి కూలీలందరికి పని కల్పించే బాధ్యత తీసుకుంటామన్నారు. స్వర్ణ గ్రామ పంచాయతీ కార్యక్రమం పేరిట రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు 13,326 గ్రామ పంచాయతీలో కూటమి ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహించినట్లు తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ మౌలిక వసతుల కల్పన, నీటి సంరక్షణ కోసం 49 రకాల పనులు, వ్యవసాయ అనుబంధ పనులు 38, మొత్తం 87 పనులకు రూ. 4,500 కోట్ల నిధులను మంజూరు చేయటం జరిగిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసి సర్పంచ్‌లకు అధికార హోదా ఇవ్వకుండా అభివృద్ధి పనులకు అడ్డంకులు సృష్టించిందని ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాగానే సర్పంచ్‌లకు అధికార హోదా కల్పించటమే కాకుండా నిధులు కేటాయించిందని తెలిపారు. చేబ్రోలులోనే కాకుండా 13 గ్రామాలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఉపాధి హామీ పథకం, జాబ్ కార్డ్ కలిగిన ప్రతి ఒక్కరికి వంద రోజులలు పని కల్పించటమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. చేబ్రోలులో మొదటి దశగా రూ. 45 లక్షలకు అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభించనునట్లు వివరించారు. ఈ సందర్భంగా తమకు పని కలల్పించటంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని పలువురు ఉపాధి కూలీలు ఎమ్మెల్యే ఎదుట ఆరోపించారు. కొద్ది రోజులు మాత్రమే పనికల్పించి పనిలేదని చెబుతున్నారని అన్నారు. ఈ గ్రామ సభలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, టీడీపీ మండల అధ్యక్షుడు షైలా వెంకట రామరాజు, జనసేన మండల అధ్యక్షుడు చందు శ్రీరాములు, కూటమి శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.

పొన్నూరు మండలంలో.. పొన్నూరు మండలంలోని 24 గ్రామాలో శుక్రవారం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సభలో గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేయాల్సిన మౌలికవసతులపై చర్చించి పనుల మంజూరుకు తీర్మానాలు చేసారు. గ్రామ సభలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజలు, పంచాయతీ పాలకులు పాల్గొన్నారు.

పట్టణాలకు దీటుగా గ్రామాల అభివద్ధి

● గ్రామ సభలో మాజీ మంత్రి ఆలపాటి
● వివిధ సమస్యలను ప్రస్తావించిన స్థానిక ప్రజలు

తెనాలిరూరల్, ఆగస్టు 23: గ్రామాల్లో నెలకొని వున్న సమస్యలను గ్రామ సభల ద్వారా తెలుసుకుని వాటిని పరిష్కరించి పట్టణాలకు దీటుగా తీర్చిదిద్దాలన్న ఆశయంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొలకలూరులో నిర్వహించిన గ్రామసభలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. గ్రామంలో నెలకొని ఉన్న అనేక సమస్యలపై ప్రజల నుండి తెలుసుకున్న ఆలపాటి త్వరలోనే గ్రామాలను మోడల్ గ్రామాలుగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్థుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమ గ్రామంలో దాదాపుగా వైసీపీ పాలన ప్రారంభమైన నాటి నుంచి పారిశుధ్య పనులపై దృష్టిపెట్టిందే లేదని, దీంతో ఎక్కడ మురుగు అక్కడే ఉంటూ తమ కాలనీలు దోమలకు ఆవాసాలుగా మారాయని పలువురు వాపోయారు. గతంలో మంచి నీరు కలుషితమవ్వడంతో డయేరియా అనుమానిత వ్యాధితో ఓ బాలిక మృతి చెందగా పలువురు చికిత్స పొంది బయటపడ్డారని ఆలపాటి దృష్టికి తీసుకు వచ్చారు. రైతులకు సకాలంలో సాగునీరందక ఐదేళ్లుగా సాగులో ఆశించినంత పంట దిగుబడిరాక అప్పుల పాలయ్యామని పలువురు రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. గ్రామ వీఆర్వోలు రైతులకు అందుబాటులో ఉండటంలేదని ఆరోపించారు. ఇలా అనేక సమస్యలు గ్రామసభ ద్వారా ప్రజలు మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని ఇతర గ్రామాల్లోనూ పారిశుధ్య సమస్యలు, ప్రదానరోడ్లు, డొంక మార్గాలపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి.



కొలకలూరు గ్రామసభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి

కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చొప్పర ప్రీతి, ఇన్‌ఛార్జ్ కార్యదర్శి రామసుబ్బారావు, పశువైద్యశాల వైద్యురాలు మీనాక్షి, ఎంఈవో -2 జయంతిబాబు, పలు శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని 18 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు.

కొల్లిపర: కూటమి ప్రభుత్వం ద్వారా రానున్న ఐదు సంవత్సరాల్లో గ్రామాలన్ని అభివృద్ధి చెందనున్నట్లు మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దావులూరిపాలెంలో హౌసింగ్ ఏఈ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తొలుత ప్రభుత్వ అధికారులతో శాఖల వారిగా సమీక్ష నిర్వహించారు. అనంతరం స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మనకు ఇద్దరూ మంత్రులున్నారని, వారి నేతృత్వంలో ఈ ప్రాంత మరింత అభివృద్ధి చెందనున్నట్లు తెలిపారు. ప్రజాసమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు గ్రామ సభలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం వలన ప్రజలు అనేక విధంగా నష్టపోయారన్నారు. కూటమి ప్రభుత్వం ద్వారా రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని, ప్రజలు సుభిక్షంగా జీవిస్తారని అన్నారు.

కార్యక్రమంలో సర్పంచ్ దొంతగాని శ్రీను, టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, టీడీపీ తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.



కొల్లిపర గ్రామ సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి రాజేంద్రప్రసాద్

కేరళ వరద బాధితులకు ఆర్థిక సాయం

తెనాలి అర్బన్, ఆగస్టు 23 : కేరళలో ఇటీవల సంభవించిన వరదల్లో నష్టపోయిన బాధిత ప్రజలకు సహాయార్థం విద్యార్థులు రూ.17,672 సాయాన్ని అందించారు. మారీసుపేట ఎన్‌సీఆర్ఎన్ఎం హైస్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు పి.భాస్కరరావు ఈ మొత్తాన్ని కలెక్టర్ నాగలక్ష్మికి శుక్రవారం అందజేశారు. పాఠశాల విద్యార్థులు తాము దాచుకున్న నగదు ఇవ్వడంతో పాటు విరాళాలు సేకరించారు. కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి ఈ మొత్తాన్ని పంపించేందుకు గాను కలెక్టర్‌కు అందజేసినట్లు భాస్కరరావు తెలిపారు.

స్పేస్ క్విజ్ పోటీలలో

నారాకోడూరు విద్యార్థులకు ప్రథమ స్థానం

చేబ్రోలు, ఆగస్టు23: జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా గుంటూరులో జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిల్చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్విజ్ పోటీలలో తమ విద్యార్థులు షేక్ నస్రీన్, కే. బాల భవ్యశ్రీ, కే.హారిక ప్రథమ స్థానంలో నిలిచి, డీఈవో పీ. శైలజ, జిల్లా సైన్స్ ఆఫీసర్ గౌస్, జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ జైశంకర్ చేతుల మీదుగా బహుమతులు పొందారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, సహ విద్యార్థులు అభినందించారు.

అబ్దుల్ జలీల్ మృతి బాధాకరం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరుటౌన్, ఆగస్టు23: పొన్నూరు పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ముస్లీం మైనార్టీ నేత షేక్ అబ్దుల్ జలీల్ మృతి బాధాకరమని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. డీసీసీ మాజీ కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ భౌతికకాయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం జలీల్ కుటుంబ సభ్యులను పరామర్శించి తెలియజేసారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్వీఆర్అండ్‌జేసీ ఐటీబీఐ సెంటర్‌ను

సందర్శించిన డీఎస్‌టీ బృందం

గుంటూరు(విద్య), ఆగస్టు 23 : స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఇంక్లూసివ్ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యూబేటర్(ఐటీబీఐ) కేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని డిపార్టుమెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(డీఎస్‌టీ) డైరెక్టర్ డాక్టర్ నవీన్‌వశిష్ఠ, సిఎంఆర్ టెక్నికల్ డీన్ అశుతోష్ సక్సేనా, నరేంద్ర నేర్ల, ఆచార్య రాధాకృష్ణ, ఆహబ్ సీఈవో రవిఈశ్వరరావు తదితరుల బృందం శుక్రవారం పరిశీలించారు. అంకుర పరిశ్రమల ఏర్పాటు కోసం డీఎస్‌టీ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని బృందం సభ్యులు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు యువతలో ఉన్న నైపుణ్యాలను వెలికితీసి వారిని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడానికి ఇక్కడి ఐటీబీఐ కేంద్రం కృషి చేస్తుందని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, ఆర్అండ్‌డి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ నార్నె శ్రీనివాసరావు, ఐటీబీఐ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఎంపీపీ చంద్రశేఖరరావు, కో ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఎస్.రాధిక పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

● పీహెచ్‌సీ వైద్యాధికారి హనీఫ్

తెనాలి రూరల్, ఆగస్టు 23: జ్వరం, ఒళ్లు నొప్పులు, నీరసం వంటి అనారోగ్య సమస్యలతో బాధపడేవారు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలని సంగంజాగర్లమూడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హనీఫ్ అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీలో ఆయన మాట్లాడుతూ వాతావరణంలో వచ్చిన మార్పులతో జ్వరపీడితులు పెరుగుతున్నారన్నారు. ఎక్కువ శాతం మంది గ్రామాల్లో జ్వరం వచ్చిన వెంటనే దగ్గరలోని మందులషాపుల్లో మందులు తీసుకుని వేసుకుంటున్నారని, ఫలితంగా తాత్కాలిక ఉపసమనం ఇస్తూ తిరిగి సమస్య జఠిలమవుతుందన్నారు. వ్యాధి తొలిదశలోనే వైద్యులను సంప్రదిస్తే రక్తపరీక్షల అనంతరం రిపోర్టును బట్టి మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. దీంతో త్వరితగతిన ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చనారు. పీహెచ్‌సీలో అన్నిరకాల రక్తపరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయని పూర్తి ఉచితంగా ఈ సేవలు పొందవచ్చని ఆయన సూచించారు.

హెచ్‌ఐవీపై అవగాహన

తెనాలి, మారీసుపేట ఆగస్టు 23: స్థానిక చినరావూరులోని ఐటీఐ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు సిరి మహిళా సాధికారిక వెల్‌ఫేర్ సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ కేరాజు ఆధ్వర్యంలో 'మీకు తెలుసా హెచ్ఐవి గురించి' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ విభాగం సహకరంతో ఇన్‌టెన్సిఫైడ్ ఐఈసీ కాంపేన్ - 2024 కార్యక్రమాన్ని ఈనెల 12వ తేదీ నుంచి అక్టోబర్ 12వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులకు హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాప్తి కారకాలు, లక్షణాలు, రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా మంచి భావితర పౌరులుగా, ఆరోగ్య కరమైన జీవితాన్ని జీవించాలని, తద్వారా సమాజాన్ని ఏర్పాటు చేయవలసిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ సిహెచ్ వెంకటేశ్వర్లు, సొసైటీ సభ్యులు ఎం శివశంకర్, కమల్, రాజు, లక్ష్మి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

25న ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్ ఆవిర్భావ వేడుకలు

● ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించిన సంఘ సభ్యులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 23: ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్ ఆవిర్భావ వేడుకలను ఈనెల 25న గుంటూరు విద్యానగర్ సిద్ధార్థగార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. బృందావన్ గార్డెన్స్‌లోని తేనీగ రెస్టారెంట్‌లో కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను శుక్రవారం ఆవిష్కరించి, వివరాలను వెల్లడించారు. అసోసియేషన్ స్థాపించి 55 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, ప్రముఖ ప్రవచన కర్త గరికపాటి నరసింహారావు, టీడీపీ నాయకులు కంభంపాటి రామ్మోహనరావు, సినీ నిర్మాత చలసాని అశ్వినీదత్, సీనియర్ నటీ జయసుధ, దర్శకుడు వైవీఎస్ చౌదరి హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు జజ్జూరి మల్లికార్జునరావు, చిర్రావూరి సాంబశివరావు, దారపనేని శివప్రసాదు, కేతినల్లి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



గుడివాడ గ్రామ సభలో ఇరిగేషన్ ఏఈకి వినతి పత్రం అందిస్తున్న శివసాంబిరెడ్డి

ఉపాధి హామీ పథకాన్ని మరింత చేరువచేయండి

● అధికారులను కోరిన రైతుసంఘం నేత శివసాంబిరెడ్డి

తెనాలి రూరల్, ఆగస్టు 23: గ్రామీణ పేదలకు వరంగా ఉన్న ఉపాధిహామీ పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తూ ప్రజలకు చేరువచేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. శుక్రవారం గుడివాడ, కొలకలూరులో జరిగిన గ్రామ సభలకు ఆయన హాజరై ఉపాధి హామి పథకంపై ఇరిగేషన్ ఎఈ ఉషారాణికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం నిధులతో గ్రామ పంచాయతీ పరిధిలో మెటీరియల్ కాంపోనెంట్ పెంచడం వలన పథకం నీర్వీర్యమై పోతుందని ఆవేధన వ్యక్తం చేశారు. వామ పక్షాల పోరాట ఫలితంగా వచ్చిన ఉపాధిహామి పథకానికి తూట్లు పొడిచేలా కేంద్రప్రభుత్వం నిధుల్లో కోత పెడుతుందని ఫలితంగా ప్రజలకు కరువు పనులు దూరమయ్యే పరిస్థితి ఉందని ఆరోపించారు. గ్రామ పంచాయతీ పరిధిలో 60శాతం కార్మికులకు 40 శాతం మెటీరియల్ కాంపొనెంట్‌కు నిధులు ఖర్చు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇండ్ల స్థలాలు, పాఠశాలలకు, ఆట స్థలాలకు, శ్మశాన స్థలాలకు మెరకలు వంటి వాటికి సైతం ఈ పథకం నిధుల ద్వారానే ఖర్చు చేస్తున్నారని, రైతులకు ఉపయోగపడే విధంగా పంట కాల్వలు, మురుగు కాల్వలలో గుర్రపు డెక్క, జంగిల్ క్లియరెన్స్ వంటివాటిని కూడా మట్టి పనుల పథకంలో చేర్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. గుడివాడ గ్రామ సర్పంచ్ యడ్లపాటి రాకేష్, వ్యవసాయకార్మిక సంఘం నాయకులు జ్యోతుల కోటేశ్వరరావు, బండి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. గుడివాడ గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో ఇరిగేషన్ ఎఈ ఉషారాణికి వినతి పత్రం అందించారు.

పెదవడ్లపూడి హైలెవల్ ఛానల్ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేయండి

రైతాంగానికి ఉపయోగకరంగా ఉన్న పెదవడ్లపూడి హైలెవల్ ఛానలల్ ఎత్తిపోతల పథకానికి రూ మూడు కోట్లు నిధులు ప్రభుత్వం విడుదల చేసి పనులు పూర్తిచేయాలని కొలకలూరు గ్రామ సభలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకాశివసాంబిరెడ్డి కోరారు. ఈ ఛానల్ ద్వారా నీరు విడుదలైతే 26,000 ఎకరాల పంటపొలాలకు నీరందుతుందని, ఫలితంగా రైతాంగం నీటి ఎద్దడి నుంచి బయటపడతారన్నారు. అదేవిధంగా డొంకరోడ్లను బాగుచేయించాలని విన్నవించారు.

వనదుర్గా దేవిగా కనకదుర్గా భవానీ



వన దుర్గా దేవిగా దర్శనం ఇస్తున్న కనకదుర్గా భవానీ అమ్మవారు

పొన్నూరుటౌన్, ఆగస్టు23: పట్టణ శివారులోని జీబీసీ రోడ్డులో వేంచేసివున్న కనకదుర్గా భవానీ అమ్మవారు వన దుర్గాదేవిగా భక్తుల పూజలందుకుంది. శ్రావణమాసం శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల పళ్లు, కూరగాయలతో అమ్మవారిని వన దుర్గాదేవిగా అలంకరించారు. ఆలయంలో మహిళల చేత సామూహిక కుంకుమార్చనలు జరిపారు. వన దుర్గాదేవిగా దర్శనం ఇచ్చిన అమ్మవారిని పూజించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. అలాగే పట్టణంలోని తోటమ్మ తల్లి ఆలయం, పలు అమ్మవార్ల ఆలయాలో శ్రావణ శుక్రవార పూజలు భక్తి శ్రద్ధలతో జరిగాయి.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

తెనాలి, మారీసుపేట ఆగస్టు 23: దుర్గ భవాని మాతకు ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని దుర్గ భవాని ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని దుర్గమ్మతల్లికి ప్రత్యేక సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలను నిర్వహించి, వివిధ పుష్పాలతో దుర్గమ్మతల్లిని అలకరించి పూజలను నిర్వహించారు. మహిళ భక్తులు వేకువజామునే ఆలయంకు చేరుకొని అమ్మవారిని దర్శించి ప్రత్యేక అభిషేకాలను, పూజలను చేసి, పొంగళి మొక్కులను చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాఘవేంద్ర శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పలువురు పాల్గొన్నారు.



వృద్ధుడి ఓటు హక్కుపై విచారణ చేస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

పారదర్శకంగా ఓటర్ల జాబితా

తెనాలి రూరల్, ఆగస్టు 23: ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల జాబితాను పారదర్శకంగా తీర్చిదిద్దుతున్నామని తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. శుక్రవారం మండలంలోని అంగలకుదురుకు చెందిన 100 ఏళ్ల వృద్ధుడి ఓటు హక్కుపై ఇంటికి వెళ్లి వాకబు చేశారు. అనంతరం పలు ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ఆధారంగా విచారణ జరిపారు. కార్యక్రమంలో గ్రామసచివాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు రక్షణ చర్యలు చేపట్టాలి

● కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు

గుంటూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రమాదకరమైన కేటగిరిలోని పరిశ్రమలలో దుర్ఘటనలను నివారించేందుకు యాజమాన్యాలు రక్షణ ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహణ చేసేలా సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ సమావేశమందిరంలో కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం జిల్లా ఇండస్ట్రీయల్ అండ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలలో రక్షణ ఏర్పాట్లను ఫ్యాక్టరీస్, కార్మికశాఖ, విద్యుత్, అగ్నిమాపకశాఖ, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు తదితర శాఖలు నిర్వహించిన తనిఖీలలో పూర్తి వివరాలతో కూడిన నివేదిక అందించాలన్నారు. సమావేశంలో కోల్డ్‌స్టోరేజీ, చిల్లీస్ వ్యాపారుల సంక్షేమసంఘం ప్రతినిధులు తెలిపిన అంశాలపై సంబంధితశాఖల ద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 24 ఎంఎస్ఎం ఈ పరిశ్రమలకు ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ, రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ఇంట్రస్ట్ సబ్సిడీ, పవర్‌కాస్ట్ సబ్సిడీకి సంబంధించి రూ.1,77,13,524 మంజూరు చేస్తూ సమావేశంలో కలెక్టర్ ఆమోదించారు. సమావేశంలో అధికారులు, అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

సక్రమంగా ఇసుక బుకింగ్, రవాణ

జిల్లాలో ఉచిత ఇసుక విధా నానికి సంబంధించి వినియోగదారులకు ఇబ్బంది లేకుండా బుకింగ్, రవాణ సక్రమంగా జరిగేలా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ నాగలక్ష్మి రెవెన్యూ(ఎక్సైజ్), కామర్స్ (మైన్స్) శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనాకు నివేదించారు. శుక్రవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి ప్రిన్సిపల్ సెక్రటరీ మీనా జిల్లాలో ఉచిత ఇసుక విధానం అమలు, బుకింగ్‌పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశమంది రం నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ ఏ.భార్గవ్‌తేజ ఈ సమావేశానికి హాజరయ్యారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఇసుక బుకింగ్‌కు సంబంధించి తుళ్ళూరు మండలం స్టాక్ యార్డు సమీపం లోని తుళ్ళూరు తహశీల్దారు కార్యాలయంలో, విజయవాడ వైపు వారికి తాడేపల్లి తహశీల్దారు కార్యాలయంలో, గుంటూరు నగర పరిసర ప్రాంతాల ప్రజల కోసం ఆర్డీవో కార్యాలయంలో ఇసుక బుకింగ్‌కు ఏర్పాట్లు చేయటం జరిగిందన్నారు.